




బాబొస్తున్నారు..

నేడు కొత్తపేట మండలం వానపల్లిలో గ్రామసభ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలిసారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించడానికి శుక్రవారం రానున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని వానపల్లి గ్రామంలో జరిగే రెవెన్యూ గ్రామసభకు హాజరుకానున్నారు.



క్వారీసెంటర్‌లో నిర్మించిన పార్లమెంట్ నమూనా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

అంబేడ్కర్ ఆలోచన విధానాలతోనే ముందుకు

రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు22: తన ఊపిరి ఉన్నంత వరకు భారత రాజ్యాంగానికి లోబడి పనిచేస్తానని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంతో కూడిన పార్లమెంట్ నమూనా భవన్‌ను గురువారం రాత్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొలుత మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీఎం.సత్యవేణి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీనులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆనంతరం అక్కడ జరిగిన సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకువెళ్లడంలో కూటమి ప్రభుత్వం ముందుండి పనిచేస్తుందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామన్నారు. రాజ్యాంగానికి అనుకూలంగానే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. గత ఐదేళ్లపాటు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని వైసీపీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. జగన్‌రెడ్డి, అతని తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేశాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి లోబడి పనిచేస్తున్నామన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజలు వైసీపీతోనే ఉన్నారని ఆ పార్టీ ఆపోహపడిందని, కానీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయా డివిజన్లలో అత్యధిక మెజార్టీ కూటమికి ఇచ్చారని గుర్తుచేశారు. అంబేడ్కర్ వంటి గొప్పవారిని స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అంబేడ్కర్ విగ్రహాలను పెట్టుకుంటున్నాం కానీ ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా పోరాటడమే ఆ మహనీయునికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ఎస్సీసెల్ అధ్యక్షుడు చాపల చిన్నరాజు, బేసరి చిన్ని, లీగల్ సెల్ నాయకులు రాచపల్లి ప్రసాద్, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, తెలుగు మహిళానగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ కప్పల వెలుగుకుమారి, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, సింహా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇదో చరిత్ర!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- నేడు గ్రామ సభలు
- జిల్లాలోని 300 పంచాయతీల్లోనూ ఉదయం 9 గంటల నుంచి సభలు
- ప్రజలందరూ రావాలి.. సమస్యలు చెప్పాలి
- ఇదే సభలో పంచాయతీ పరిధిలోని అన్ని సమస్యల పరిష్కారానికి తీర్మానం
- నేడు రూ.1000 కోట్ల పనుల వరకూ తీర్మానం చేసే అవకాశం
- కాటకోటేశ్వరం సభలో పాల్గొననున్న మంత్రి కందుల, కలెక్టర్ ప్రశాంతి
- ఉపాధి హామీ పనులూ నిర్ణయం

కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల చరిత్రలో ఓ సువర్ణాధ్యాన్ని లిఖించనుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి జిల్లాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ గ్రామ సభలు నిర్వహించనున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా వానపల్లిలో జరిగే గ్రామసభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా హాజరుకానున్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్ని గ్రామ పంచాయతీల్లో నిబంధనల ప్రకారం ఏడాదికి నాలుగుసార్లు మహాజన సభలు జరగాలని చెప్పిన సంగతి తెలిసిందే. గతంలో ప్రతీ ఏటా నాలుగు సభలు నిర్ణీత సమయాల్లో జరగాల్సిఉండగా, పంచాయతీ అధికారులు, స్థానిక పాలకులు కుమ్మక్కై, తూతూమంత్రంగా నిర్వహించి ఇష్టానుసారం తీర్మానాలు చేసుకుని పంచాయతీ సొమ్మును దోచుకునేవారు. ఇక కూటమి ప్రభుత్వం వాటిని సాగనీయమని చెబుతోంది. అందుకే కచ్చితంగా గ్రామసభలు గ్రామ ప్రజల సమక్షంలోనే జరగాలని, గ్రామాల్లో అసలు ఏమి జరుగుతుందో కూడా అందరికీ తెలియాలనే ఈ సభల ఉద్దేశం. గతంలో గ్రామాల్లో రాజకీయాల వల్ల కొన్ని సమస్యలు పరిష్కారం కావు. పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, కంపోస్టు యార్డులు, వీధి లైట్లు లేకపోవడం గోతుల్లో నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. అంతేకాక ఉపాధి హామీ పథకం ద్వారా అనేక పనులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ సభల్లో ప్రజల నిత్యజీవనానికి ఇబ్బందికరంగా ఉన్న సమస్యలను కూడా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, గ్రామ సమస్యలను పట్టించుకోకపోవడం, చెట్లు, షాపులు, చెరువుల లీజు వ్యవహారాల్లో లోపాలు అన్ని ఇక్కడ ప్రస్తావన కొచ్చే అవకాశం ఉంది. ప్రజలు ఏ సమస్యనైనా ఇక్కడ లేవనెత్తవచ్చు.

గ్రామాల్లో సామాజిక అవసరాలు..

ప్రతీ గ్రామంలో మంచినీటి సరఫరా పథకాలు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు ఉండాలి. లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధి లైట్లు, సిమెంట్ రోడ్లు, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ వంటివన్నీ ఏర్పాటుచేయాలి. ఇప్పుడు వాటిని అభివృద్ధి చేయాలనేదే ఈ సభల ఉద్దేశం. అన్ని గ్రామాలకు దగ్గరలోని ప్రధాన మార్కెట్‌లో అనుసంధాన రోడ్లు ఉండాలి. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి సంస్థ వీటిని కల్పించాలి. గ్రామ పంచాయతీలోని ఇంటర్నల్ రోడ్లు, లింక్ రోడ్లు, గ్రామాలను, మండలాలను కలిపే రోడ్లు కూడా నిర్మిస్తారు. స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో వీటిని అభివృద్ధి చేస్తారు. ఈ గ్రామసభల్లో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు కూడా పాల్గొంటారు. జిల్లాలోని నిడదవోలు మండలంలో కాటకోటేశ్వరంలో శుక్రవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొంటారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఆయా నియోజకవర్గాల పరిధిలో పాల్గొంటారు.

ఉపాధి హామీ పనులూ వేగవంతం

ప్రతీ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల ఉపాధి కల్పించడం. పనికోరిన 15 రోజుల్లోనే పని చూపించడం, పనికోరిన తేదీ నుంచే నిరుద్యోగ భృతి ఇవ్వడం వంటి నిబంధనలు ఉన్నాయి. వ్యవసాయ అనుబంధ పనులు కూడా చేయవచ్చు. కొత్తగా ఫీడర్ కాలువలు నిర్మించడం, పంట కాలువలు నిర్మించడం, పొలంగట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో ఫార్మ్ పాండ్ నిర్మించడం, వ్యక్తిగత భూముల్లో భూమిని అభివృద్ధిచేయడం, సరిహద్దులో కందకాలు తవ్వకోవడం, రైతు భూముల్లో గడ్డి పెంచుకోవడం, గొర్రెల షెడ్ల నిర్మాణం, కోళ్లఫారాలు, పశువుల షెడ్లు, పట్టుపురుగుల షెడ్‌ల నిర్మాణం, మల్లె, గులాబి వంటి పూలతోటలు పెంచడం, పండ్ల తోట్ల పెంపకం వంటి చేయవచ్చు. ఇలా 38 రకాల పనులకు ఉపాధి హామీ నిధులను అనుసంధానం చేశారు. ఇవన్నీ సభల్లో చర్చకు వస్తాయి.

గ్రామ ప్రణాళికలు రూపొందిస్తాం : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ గ్రామ ప్రణాళికలు రూపొందిస్తామని, సభలోనే తీర్మానం చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. జిల్లాలోని 300 గ్రామ పంచాయతీల్లోనూ ఉదయం పది గంటలలోపు సభలు మొదలు కావాలన్నారు. వీటికి స్పెషల్ ఆఫీసర్లను నియమించామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొంటారన్నారు. గ్రామాల్లోని నీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్లు వంటి అన్ని రకాల సమస్యలను పరిష్కార దిశగా ఇక్కడ తీర్మానం చేస్తారని, విద్యుత్ కనెక్షన్లు, కుళాయి, మరుగుదొడ్డి, ఎల్‌పీజీ గ్యాస్, ఉపాధి హామీ పనులు వంటివన్నీ, ప్రజలు ఇచ్చిన ప్రతీ అంశాన్ని పరిశీలిస్తారని చెప్పారు.



అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

అడిషనల్ ఎస్పీగా సుబ్బరాజు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు)గా అల్లూరి వెంకట సుబ్బరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాలో ఎస్ఈబీలో విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక వ్యక్తులపై నిరంతర నిఘా పెడతామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఆ విధంగా ప్రేరేపించినా ఉపేక్షించేది లేదన్నారు. రాత్రి వేళల్లో గస్తీని విస్తృతంగా పెంచుతామని చెప్పారు. ఎస్పీ నరసింహ కిషోర్ పర్యవేక్షణలో జిల్లాలోని నేరాల అదుపునకు పటిష్ట చర్యలు చేపడతామని తెలిపారు.

నేటి నుంచి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 23వ తేదీ సాయంత్రం రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ దర్శంచర హాలులో అరిపిరాల నారాయణరావు రూపొందించిన అంత్యానుప్రాస నిఘంటువు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 24వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకూ జాతీయరహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రముఖులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. 25న ఉదయం పది గంటలకు కాకినాడలో జరిగే ఒక సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం కాండ్రేగుల గ్రామంలో వంగవీటి మోహన రంగ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రాజమహేంద్రవరం చేరుకుని సాయంత్రం ఐదు గంటలకు ఎంపీ ఆఫీసులో అందుబాటులో ఉంటారు. 26వ తేదీ ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం క్వారీ ఏరియాలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా పార్టీ కార్యకర్తలతో జరిగే సమావేశంలో పాల్గొంటారని ఎంపీ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పలువురు మంత్రులకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల వినతి

మళ్లీ వాళ్లే..



- పాత కాంట్రాక్టర్‌తోనే సీనరేజీ వసూళ్లు
- వైసీపీ హయాంలో వాళ్ల ఇష్టారాజ్యం
- రోడ్ల మీద చెక్‌పోస్టులు పెట్టి దోచేశారు
- ఇంకా రూ.44 కోట్ల సీనరేజీ సొమ్ము బకాయి
- డూప్లికేట్ బిల్లులతోపాటు సీనరేజీ లూటీ
- సుధాకర్ ఇన్‌ఫ్రాకు అనుమతి.. ఫీల్డ్‌లో ఏఎంఆర్ స్టాఫ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మైన్స్ సీనరేజీ వసూలు బాధ్యతను మళ్లీ సుధాకర్ ఇన్‌ఫ్రాకే మైన్స్ అధికారులు కట్టబెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం 2023 ఏప్రిల్ 18 నుంచి 2025 వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మైన్స్ సీనరేజ్ వసూలు కాంట్రాక్టును ఈ కంపెనీకి అప్పగించింది. అంతకుముందు మైన్స్ అధికారులే సీనరేజీ వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించేశారు. కానీ వైసీపీ దీనికో దోపిడీ మార్గాన్ని ఎన్నుకుని, సీనరేజి వసూలు బాధ్యతలను ప్రైవేట్ సంస్థల పేరుతో వైసీపీ నేతలకు సంబంధించిన సంస్థలకే అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ జరిగే అన్ని జిల్లాలోనూ ఇదే విధానం అమలుచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థకు ఇచ్చింది. కాకినాడలో గత ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన చలమలశెట్టి సునీల్ కుటుంబానికి చెందిన కంపెనీ ఇది. ఈ కంపెనీ పేరు మీదే ఒప్పందం జరిగినప్పటికీ.. రావులపాలెం, కడప ప్రాంతాలకు చెందిన వైసీపీ వర్గీయులు, గోకవరం మండలానికి చెందిన ఓ వైసీపీ నేత సీనరేజి వసూలు చేశారు. నెలకు సుమారు రూ.10 కోట్లు వంతున రెండేళ్లలోనే రూ.233 కోట్లు చెల్లించేలా ఒప్పందం జరిగింది. మైన్స్ రకాన్ని బట్టి సీనరేజీ ఉంటుంది. గ్రావెల్, భవన నిర్మాణ మెటీరియల్స్, లేటరైట్, మట్టి.. ఇలా రకాన్ని బట్టి మినిమం సీనరేజీ చార్జీలు ప్రభుత్వానికి చెల్లించాలి. క్యూబిక్ మీటరు లెక్కన సీనరేజీ నిర్ణయిస్తారు. కానీ ఈ కంపెనీ పేరిట అనేక రోడ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి రాత్రీ పగలూ సీనరేజీ వసూలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు పట్టించుకోకుండా ఇష్టానుసారం లారీకి రూ.1000 నుంచి అదనంగా వసూలుచేశారు. రూ. కోట్లు దోచేసుకున్నారు. రావులపాలెంనకు చెందిన ఒకరిద్దరు ఇందులో కీలకంగా వ్యవహరించారు. మైన్స్ యజమాని కూడా తన సొంత పనికి ఓ లారీ సరుకు తీసుకోవాలన్నా ఎక్కువ సీనరేజీ చెల్లించవలసి వచ్చేది. వీరికి వైసీపీ అండగా ఉండడంతో వారి దందా సాగింది. చెరువుల్లో మట్టి తీసుకుని వెళ్లినా సీనరేజీ పేరిట అక్రమ వసూళ్ల దందా సాగింది. పైగా ఎన్ని లారీల మెటీరియల్ రవాణా జరిగిందనే దానిలో కూడా మోసాలు జరిగాయి. అధికారికంగా ఒక బిల్లు ఇచ్చి సుమారు 10వరకూ డూప్లికేట్ బిల్లులు చేశారనే ఆరోపణ కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు చాలా ఇబ్బందిపడ్డారు. మైన్స్‌లీజుదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కంపెనీ ప్రభుత్వానికి ఇప్పటికీ రూ.44 కోట్లు బకాయి ఉంది. కానీ వచ్చే ఏప్రిల్ 17వ తేదీ వరకూ ఈ కంపెనీకి ఒప్పంద గడువు ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడితే తర్వాత ఈ విధానం మార్పుకోసం ఎదురుచూశారు. కానీ ఒప్పందాన్ని అనుసరించి తిరిగి అదే కంపెనీకి అధికారులు బాధ్యత అప్పగించారు. కానీ నిబంధనలు కఠినతరం చేశారు. గతంలో మాదిరిగా ఇష్టానుసారం వసూలుచేయడానికి లేదు. ఆన్‌లైన్‌లో బిల్లులు చేయాలి. ఏ క్వారీ నుంచి ఎన్ని యూనిట్లు మెటీరియల్ వచ్చిందో ఆన్‌లైన్‌లో ఉండాలి. ఈసారి ప్రభుత్వం నిర్ణయించిన సీనరేజీనే వసూలుచేసే అవకాశం ఉంది. వినియోగదారుడికి ఇది మేలే. పైగా ఇదే విధానం సక్రమంగా అమలు చేస్తే గతంలో మాదిరిగా ఇష్టానుసారం సీనరేజి ఎగ్గొట్టే పరిస్థితి తగ్గుతుంది. ఇక్కడ మరో విషయం క్షేత్ర స్థాయిలో స్పష్టమవుతోంది. ఒప్పందం ప్రకారం సుధాకర్ ఇన్‌ఫ్రాకే ఇచ్చినప్పటికీ, చెక్‌పోస్టుల వద్ద ఏఎంఆర్ కంపెనీకి చెందిన మనుషులు ఉన్నారు. ఇక్కడ అధికారికంగా సుధాకర్ ఇన్‌ఫ్రా అయినా, వసూలు చేసేది ఏఎంఆర్ కంపెనీ అనే ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వం దీన్ని అసలు పట్టించుకోలేదు. ఈసారైనా అక్రమాలు జరగకుండా చూసి ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు వచ్చే సీనరేజీ ఆదాయాన్ని పెరిగేటట్టు వినియోగదారుడికి సరైన చార్జీలతో సరఫరా చేసేటట్టు చూడవలసి ఉంది.

ఇసుక రవాణా చార్జీలు ఖరారు

జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 22: ఉచిత ఇసుక పాలసీ విధానంలో వినియోగదారుల రవాణా ఖర్చులు, లోడింగ్ చార్జీలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. జాయింట్ కలెక్టర్ సమక్షంలో రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు.

- **పది టైర్ల గూడ్స్ వాహనంలో..** పదిటైర్ల లారీలో 18 టన్నుల ఇసుకను రవాణా చేసేందుకు పది కిలోమీటర్లలోపు రూ.1620, 11-20 కి.మీ లోపు రూ.2800, 21-30 కిలోమీటర్లలోపు రూ.4080, 31-40 కిలోమీటర్లలోపు రూ.5340, 41 కిలోమీటర్ల పైబడిన ప్రతి కిలోమీటర్‌కు అదనంగా రూ.116 చొప్పున చెల్లింపులు చేయాలి.
- **ఆరుటైర్ల లారీలో...** 10 టన్నుల ఇసుకను రవాణా ఖర్చులు 10 కి.మీ లోపు రూ.1000, 11-20 కిలోమీటర్లలోపు రూ.1800, 21-30 కిలోమీటర్లలోపు రూ.2600, 31-40 కి.మీ లోపు రూ.3200, 41 కిలోమీటర్ల పైబడిన ప్రతి కిలోమీటరుకు అదనంగా రూ.67 చొప్పున చెల్లింపులు చేయాలి.
- **ట్రాక్టర్ ట్రాలీలో..** ట్రాక్టర్ ట్రాలీలో 4-5 టన్నుల ఇసుక రవాణాకు 10 కిలోమీటర్లు రూ.600, 11-20 కిలోమీటర్లలోపు రూ1100, 21-30 కిలోమీటర్లలోపు రూ1600, 31-40 కిలోమీటర్లలోపు రూ.2100, 41 కిలోమీటర్లు దాటిన ప్రతి కిలోమీటరుకు రూ.30 చొప్పున చెల్లింపులు జరగాలి.

వచ్చే నెల 11 నుంచి ఉచిత ఇసుక మార్గదర్శకాలు అమలు

ప్రస్తుతం పెండ్యాల, పందల పర్రు స్టాక్ పాయింట్లలోనే ఇసుక

కలెక్టర్, ఎస్పీ వెల్లడి

రాజమహేంద్రవరం,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 11నుంచి ఉచిత ఇసుక విధానాన్ని పగడ్బందీగా అమలు చేయడానికి కొత్త మార్గదర్శకాలు అమలులోకి రానున్నాయని, ప్రభుత్వం విధానం ప్రకారం ఉచిత ఇసుకలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేవలం పరిపాలనాపరమైన చార్జీలు చెల్లించి, రవాణా చార్జీలు పెట్టుకుని ఇసుకను పొందవచ్చని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆమె ఎస్పీ నరసింహ కిశోర్, జేసీ ఎస్.చినరాముడుతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో పెండ్యాల, పందలపర్రు గ్రామాల్లోనే ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయని, ఇక్కడ రోజుకు 120 లారీలు లోడ్ చేసుకోవచ్చన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంకాలం 6 గంటలవరకూ మాత్రమే ఇసుక సరఫరా చేస్తారన్నారు. పెండ్యాల స్టాక్ పాయింట్‌లో 98వేల టన్నులు, పందలపర్రులో 35వేల టన్నుల ఇసుక ఉందన్నారు. కొత్తగా 9 పాయింట్లు గుర్తించామని, ఇంకా కొన్ని అనుమతులు రావలసి ఉందని, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో వారంలో అవి మొదలు పెడతామన్నారు. డీసిల్టేషన్‌ను బోట్స్‌మన్ సొసైటీల ద్వారా చేపడతామని చెప్పారు. ఇంతవరకూ కొన్ని లోపాలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఏ అక్రమాలు లేకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అక్టోబరు 15 నుంచి అన్ని ర్యాంపులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈసారి ఇంటి అడ్రస్ కూడా ఇవ్వాలని, ఇసుక అక్కడకు చేరిందా లేదా అనేది కూడా చూస్తామని, వినియోగదారుడు కొత్త ఇల్లు కడుతున్నాడా, రిపేర్లా అనే విషయం కూడా నమోదు చేస్తామన్నారు. ఎస్పీ నరసింహకిశోర్ మాట్లాడుతూ ట్రిక్ షీట్ ఉంటేనే లారీలను అనుమతిస్తామన్నారు. ఇసుక, అక్రమనిల్వలు, అక్రమరవాణా, మధ్యవర్తుల ప్రమేయం, నివారించడానికి పటిష్టమైన నిఘా పెడుతున్నామన్నారు. రీచ్‌ల్లోకి అనుమతి పొందిన వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. క్యూ కడితే చర్యలు తీసుకుంటామని కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

నిడదవోలు పురపాలక సంఘం

హెచ్చరిక/పబ్లిక్ నోటీసు

R.O.C.No.789/2021/G1, Dt : 22.08.2024

నిడదవోలు పురపాలక సంఘ ప్రజలకు తెలియచేయడము ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరిచిన స్థలము/ప్లాట్లు ఎటువంటి అనుమతులూ లేకుండా అనధికారముగా లే అవుట్లు వేసియున్నారు.

క్ర.సం	మునిసిపాలిటీ	గ్రామము	సర్వే నెంబర్	విస్తీర్ణము (ఎకరాలలో)
1	నిడదవోలు	నిడదవోలు	843P	1.59
2	నిడదవోలు	నిడదవోలు	202/1a,1b,203/2	3.0
3	నిడదవోలు	నిడదవోలు	203/2	2.90
4	నిడదవోలు	నిడదవోలు	193/1	1.38
5	నిడదవోలు	నిడదవోలు	200P	1.5
6	నిడదవోలు	నిడదవోలు	299PART	0.36
7	నిడదవోలు	నిడదవోలు	816,817/4,5	3.40
8	నిడదవోలు	నిడదవోలు	814P	1.2
9	నిడదవోలు	నిడదవోలు	812P	1.01
10	నిడదవోలు	నిడదవోలు	805P	7.5
11	నిడదవోలు	నిడదవోలు	340P	2.5
12	నిడదవోలు	నిడదవోలు	832P	4.14
13	నిడదవోలు	నిడదవోలు	831P	6.52
14	నిడదవోలు	నిడదవోలు	816P	0.40
15	నిడదవోలు	నిడదవోలు	833P	2.79
16	నిడదవోలు	నిడదవోలు	827/2,3	2.3
17	నిడదవోలు	నిడదవోలు	822P	0.69
18	నిడదవోలు	నిడదవోలు	830P	5.3
19	నిడదవోలు	నిడదవోలు	839/2P,3P,5P	2.62
20	నిడదవోలు	నిడదవోలు	806P	0.8
21	నిడదవోలు	నిడదవోలు	292P	5.0
22	నిడదవోలు	నిడదవోలు	222P	4
23	నిడదవోలు	నిడదవోలు	180P,181P	1.99
24	నిడదవోలు	నిడదవోలు	302/6b	0.3011
25	నిడదవోలు	నిడదవోలు	288/2C	0.7894
26	నిడదవోలు	నిడదవోలు	181P	3.2
27	నిడదవోలు	నిడదవోలు	179/4,179/5	1.38
28	నిడదవోలు	నిడదవోలు	270P	1.5
29	నిడదవోలు	నిడదవోలు	296/1,297P,298P	1.5
30	నిడదవోలు	నిడదవోలు	828/5,6,829P	4.1
31	నిడదవోలు	నిడదవోలు	878P	1.00
32	నిడదవోలు	నిడదవోలు	177P	0.73
33	నిడదవోలు	నిడదవోలు	177P,172/P	5.30
34	నిడదవోలు	నిడదవోలు	177P	1.04
35	నిడదవోలు	నిడదవోలు	827P	1.0
36	నిడదవోలు	నిడదవోలు	167/1	3.6
37	నిడదవోలు	నిడదవోలు	169P	0.98
38	నిడదవోలు	నిడదవోలు	169P	0.96
39	నిడదవోలు	నిడదవోలు	170P	1.5
40	నిడదవోలు	నిడదవోలు	182P	1.7
41	నిడదవోలు	నిడదవోలు	849P	1.2
42	నిడదవోలు	నిడదవోలు	173/5C	0.60
43	నిడదవోలు	నిడదవోలు	206/1	1
44	నిడదవోలు	నిడదవోలు	821P	2.02
45	నిడదవోలు	నిడదవోలు	891/1,2,894/4,887/2	5.6
46	నిడదవోలు	నిడదవోలు	149A	0.53
47	నిడదవోలు	నిడదవోలు	896P,161P	3
48	నిడదవోలు	నిడదవోలు	157P	1.3
49	నిడదవోలు	నిడదవోలు	855P	0.92
50	నిడదవోలు	నిడదవోలు	852,853,855	0.68
51	నిడదవోలు	నిడదవోలు	970P	2.31
52	నిడదవోలు	నిడదవోలు	187P	0.69
53	నిడదవోలు	నిడదవోలు	187P	0.8
54	నిడదవోలు	నిడదవోలు	849P	0.39
55	నిడదవోలు	నిడదవోలు	18/A	2.38
56	నిడదవోలు	నిడదవోలు	856P,855P	0.95
57	నిడదవోలు	నిడదవోలు	844P,845P	10.46

కావున పైన తెలియపరచిన లే అవుట్ల నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ఈ ప్లాట్లకు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయబడవు మరియు ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు, మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంటు, నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించబడవు.

దీనిని గమనించ వలసినదిగా విజ్ఞప్తి.

గమనిక:- అనధికారముగా లే అవుట్ వేసి మరియు అమ్మకాలు చేయుచున్న స్థల యజమానులు లేదా డెవలపర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

సం/- **మున్సిపల్ కమిషనర్,**
నిడదవోలు మునిసిపాలిటీ.


పెళ్లి బృందాలతో సందడిగా ఉన్న రత్నగిరి ప్రాంగణం

రత్నగిరిపై పెళ్లి సందడి

సత్యదేవుని సాక్షిగా ఒక్కటైన 200 జంటలు

అన్నవరం, ఆగస్టు 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రత్నగిరి గురువారం బాజాభజంత్రీలతో మార్మోగింది. పెళ్లి బృందాలతో కిటకిటలాడింది. రామాలయం ప్రాంగణమంతా మండపాల డెకరేషన్‌తో ప్రత్యేక శోభ సంతరించుకుంది. రాత్రి 11 గంటలు, వేకువజామున 3 గంటల ముహూర్తాల్లో సత్యదేవుని సాక్షిగా సుమారు 200 జంటలు ఒక్కటయ్యాయి. పెళ్లి బృందాలకు గదుల కేటాయింపు తలకు మించిన భారం కావడంతో ఈవో ముగ్గురు సూపరింటెండెం ట్లతో కమిటీ వేశారు. ఒక్కో వివాహ బృందానికి కనీసం రెండు గదులను అందించడంతో ఊపిరి పీల్చుకున్నారు. సామాన్యులకు మాత్రం ఇక్కట్లు తప్పలేదు. పెళ్లి బృందాల వాహనాలు హరిహరసదన్, విష్ణుసదన్ కాటేజీల వద్ద రోడ్డుపై భారీగా నిలిచిపోగా సెక్యూరిటీ సిబ్బంది క్రమబద్ధీకరించారు. రద్దీ కారణంగా స్వామివారి వ్రతాలు, సర్వదర్శనాలను శుక్రవారం ఉదయం ఐదు గంటలకు ప్రారంభించాలని నిర్ణయించారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.70.16 లక్షలు




ఆత్రేయపురం, ఆగస్టు 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు ఎం.లక్ష్మీనారాయణ, పీవీవీఎస్ కామేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. ఆలయంలో 19 హుండీలు ఉండగా భారీ వర్షం కారణంగా 13 హుండీలనే లెక్కించారు. వీటి ద్వారా 39 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.70,16,714 ఆదాయం వచ్చింది. బంగారం 72 గ్రాములు, వెండి 750 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


ధనస్సు, బాణాన్ని దర్శించుకుంటున్న భక్తులు

బాలరాముడి ధనుర్బాణాలివిగో...

పెద్దాపురం, ఆగస్టు 22: అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహానికి సమర్పించనున్న ధనుర్బాణాలను కాకినాడ జిల్లా పెద్దాపురంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి అనే భక్తుడు 13 కిలోల వెండి, కిలో బంగారంతో ధనుస్సు, బాణం తయారు చేయించాడు. రామ మందిరం పూర్తికావడానికి ఇంకా సమయం ఉండడంతో వీటిని ప్రముఖ ఆలయాల్లో భక్తుల దర్శనార్థం తీసుకెళ్తున్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ధనుర్బాణాలను దర్శించి తరించారు. మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

కోనసీమలో నేడు సీఎం పర్యటన



అమలాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరతారు.

- 11.40 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను కలుసుకుంటారు.
- 11.45 గంటలకు హెలిపాడ్ వద్ద బయల్దేరి రోడ్డు మార్గంలో 11.50 గంటలకు వానపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 1.30 గంటల వరకు అక్కడ జరిగే స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామసభలో పాల్గొంటారు. ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడతారు.
- రెండు గంటల నుంచి పది నిమిషాల పాటు స్థానిక నాయకులతో ముఖాముఖి మాట్లాడతారు.
- 2.10 గంటలకు వానపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బయల్దేరి రోడ్డు మార్గంలో బయలుదేరి హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు.
- 2.20 గంటలకు హెలిపాడ్ నుంచి బయల్దేరి 2.35 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 2.45 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి 3.35 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 3.40 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి నాలుగు గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఇంటికి చేరుకుంటారు.


అయినవిల్లిలో హెలిపాడ్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

లేమ్మా... హారికా

మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు


హారిక మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు



సర్పవరం జంక్షన్, ఆగస్టు 22: వాళ్లది నిరుపేద కుటుంబం... తండ్రి తాపీమేస్త్రీ కాగా తల్లి ఓ చిన్న కిళ్లీ కొట్టు నిర్వహిస్తోంది. ఇద్దరు పిల్లలు. చీకూచింతా లేకుండా ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబాన్ని కష్టాలు వెన్నాడాయి. చిన్నప్పుడు కుమారుడు, నాలుగేళ్ల కిందట కొవిడ్‌తో భర్త, ఉద్యోగం సాధించి ఇప్పుడిప్పుడే చేతికి అందివస్తున్న క్రమంలో కుమార్తెను కోల్పోయిన ఆ తల్లి మనోవేదన వర్ణనాతీతం. అమ్మా సెలవు లేదు... మరలా వస్తానని చెప్పి ఇంటినుంచి వెళ్లిన సాయంత్రమే రియాక్టర్ పేలుడు దుర్ఘటనలో కుమార్తె హారిక తీవ్రంగా గాయపడి మృతి చెందిందన్న సమాచారం తెలిసిన వెంటనే ఆ మాతృమూర్తి కన్నీరుమున్నీరుగా విలపించింది. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న కుమార్తె మృతదేహంపై పడి గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

కాకినాడ రెండో డివిజన్ సౌజన్య నగర్‌కు చెందిన చల్లపల్లి ఈశ్వరరావు-అన్నపూర్ణ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె చల్లపల్లి హారిక (22) ఉన్నారు. ఈశ్వరరావు తాపీమేస్త్రీగా కుటుంబాన్ని పోషించాడు. కుమారుడు చిన్నప్పుడే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఈశ్వరరావు కొవిడ్‌తో మృతి చెందాడు. అన్నపూర్ణ కిళ్లీకొట్టు ద్వారా వచ్చిన సంపాదనతో కుమార్తెను మున్సిపల్ హైస్కూల్లో చదివించింది. పదో తరగతిలో పదికి పది పాయింట్లు సాధించి మెరిట్ జాబితాలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఒక ఫార్మా కంపెనీలో 2023 సెప్టెంబరులో కెమికల్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరింది. సోమవారం రాఖీ పండుగ కోసం రెండు రోజులు సెలవు పెట్టి కాకినాడలోని ఇంటికి వచ్చింది. రాఖీ పౌర్ణమి రోజున సంతోషంగా సోదరులకు రాఖీ కట్టి ఆప్యాయతను పంచుకుంది. మరో రెండు రోజులు ఉండాలని తల్లి, కుటుంబ సభ్యులు కోరినా సెలవు లేకపోవడంతో బుధవారం ఉదయం బయల్దేరి వెళ్లి ఉద్యోగంలో చేరింది. బుధవారం సాయంత్రం కంపెనీలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో విధి నిర్వహణలో ఉన్న హారిక తీవ్ర గాయాలతో మృతి చెందింది.

హారిక మృతి చెందిందన్న వార్త తెలిసిన వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మృతదేహాన్ని దగ్గరుండి తీసుకురావాలని కాకినాడ అర్బన్ తహసీల్దారు జితేంద్రను ఆదేశించారు. ఆయన ఆర్ఐ బి.రాజు, వీఆర్వో తాతారావుతో కలిసి బుధవారం రాత్రి విశాఖపట్నం వెళ్లి మహాప్రస్థానం వాహనంలో గురువారం ఉదయం మృతదేహాన్ని తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హారిక మృతదేహాన్ని చూసిన తల్లి అన్నపూర్ణ, మావయ్య, అత్తలు, పెదనాన్న, పెద్దమ్మ, సోదరులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు రోజులు ఉండమన్నా ఉండకుండా అనంత లోకాలకు వెళ్లిపోయావా తల్లీ అంటూ వారి రోదించారు. కుటుంబీకుల సమక్షంలో దహన సంస్కారాలు నిర్వహించారు. హారిక కుటుంబానికి రూ.కోటి పరిహారం చెక్కు తీసుకునేందుకు తహసీల్దారు అనకాపల్లి వెళ్లారు.

అసిస్టెంట్ మేనేజరు నాగబాబు మృతి

సామర్లకోటలో విషాదఛాయలు


భార్య, కుమార్తెలతో నాగబాబు (పాత చిత్రం)

సామర్లకోట, ఆగస్టు 22: అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన విస్ఫోటనంలో కాకినాడ జిల్లా సామర్లకోట గాంధీనగర్‌కు చెందిన మొండి నాగబాబు దుర్మరణం చెందాడు. ఉన్నత విద్య అనంతరం ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజరుగా ఉద్యోగంలో చేరిన నాగబాబు భార్య సాయి, కుమార్తె సాన్విత (9), కుమారుడు మాన్వింత్(6)లతో కలిసి విశాఖపట్నంలో నివాసముంటున్నాడు. రోజూలాగే బుధవారం కూడా ఉద్యోగానికి వెళ్లిన భర్త ప్రమాదంలో చిక్కుకుని తిరిగిరాని లోకాలకు వెళ్లాడన్న సమాచారం తెలిసి భార్య నిశ్చేష్టురాలైంది. నాగబాబు తల్లి లక్ష్మి, ఇద్దరు సోదరులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వారంతా బుధవారం రాత్రి హుటాహుటిన విశాఖకు పయనమయ్యారు. మృతదేహాన్ని గురువారం రాత్రి సామర్లకోట తీసుకొచ్చారు. నాగబాబు కుటుంబానికి రూ.కోటి పరిహారం చెక్కు తీసుకునేందుకు తహసీల్దారు అనకాపల్లి వెళ్లారు.

తిరిగిరాని లోకాలకు గణేష్‌కుమార్

మగ దిక్కు కోల్పోయామంటూ కుటుంబీకుల కంటతడి


గణేష్‌కుమార్ (పాత చిత్రం)

బిక్కవోలు, ఆగస్టు 22: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం జువ్వలదొడ్డికి చెందిన కొప్పర్తి గణేష్‌కుమార్ (33) మృతి చెందాడు. గణేష్ తండ్రి సత్యనారాయణకు భవాని టైలర్‌గా గ్రామంలో మంచి పేరుంది. ఈయన ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి గణేష్ ఇంటి బాధ్యతలు చేపట్టాడు. డిగ్రీ చదివిన గణేష్‌కు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఓ కుమారుడు కూడా వున్నాడు. తల్లి, చెల్లి, భార్య, కుమారుడికి గణేషే ఆధారం. హైదరాబాద్‌లోని దివీస్ కంపెనీలో పనిచేసిన అతడు మూడేళ్ల క్రితం అచ్యుతాపురంలోని కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విధుల్లో చేరాడు. మగదిక్కు కోల్పోయామంటూ గణేష్ తల్లి, చెల్లి, భార్య విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.


సెమినార్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

భవిష్యత్తు అంతా స్మార్ట్ మెటీరియల్‌దే

అంతర్జాతీయ సైన్స్ సెమినార్‌లో శాస్త్రవేత్తల ఉద్ఘాటన

మండపేట, ఆగస్టు 22: మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు వారి విలువైన సందేశాలను అందించడం హర్షణీయమన్నారు. సెమినార్ నిర్వహణకు కళాశాల అధ్యాపకులు చేసిన కృషిని వేగుళ్ల కొనియాడారు. 'స్మార్ట్ మెటీరియల్, అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్' అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సెమినార్‌ను మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే వేగుళ్ల జ్యోతిప్రకాశనంతో ప్రారంభించారు. సెమినార్‌కు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మారుతున్న కాలంతో పాటు సమాజంలో స్మార్ట్ మెటీరియల్ అవశ్యకతను దక్షిణ కొరియా నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎన్.నవీన్‌కుమార్, డాక్టర్ ఎన్.భార్గవ్ వివరించారు. తిరుచానపల్లి ఐఐటీ నుంచి వచ్చిన ప్రొఫెసర్ హేమలత నానో టెక్నాలజీ గురించి వివరించారు. డాక్టర్ బిపిన్‌కుమార్ (న్యూఢిల్లీ), డాక్టర్ పి.విష్ణుప్రశాంత్ (తిరుపతి) స్మార్ట్ మెటీరియల్‌పై విద్యార్థులకు వివరించారు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ మెటీరియల్ ప్రాధాన్యాన్ని గుర్తించాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు వందకు పైగా వ్యాసాలను సదస్సులో ప్రదర్శించారు. విద్యార్థులు శాస్త్రవేత్తల సందేశాలను విని వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మారుమూల పట్టణమైన మండపేటలో ఈ తరహా అంతర్జాతీయ సెమినార్ నిర్వహించడం, అందులో పాల్గొనడం తమకెంతో ఆనందంగా వుందని శాస్త్రవేత్తలు చెప్పారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎన్ఎస్‌వీ కిరణ్‌కుమార్, ఎ.ఆనందరావు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గంగా స్నేహభావంతో లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే సమయం, ఖర్చు ఆదా అవుతాయని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని తన చాంబర్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సెప్టెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీల్లో దాదాపుగా 40 ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. న్యాయవాదిని నియమించుకునే పరిస్థితి లేనివారు నేరుగా కోర్టు అవరణలో ఉండే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే సహాయం చేస్తారన్నారు. ఎలాంటి ఖర్చు ఉండదని చెప్పారు. కేసు పరిష్కారమైన తర్వాత ఇరుపక్షాలనూ విజేతలుగానే భావిస్తారు. లోక్ అదాలత్ అవార్డు (తీర్పు)పై ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప అప్పీల్ చేసుకునే అవకాశం కూడా లేదన్నారు. ఒకవేళ ఒప్పుకున్న పరిహారం ఇవ్వడంలో ఇబ్బందిపెడితే నేరుగా ఇక్కడే పిటిషన్ వేసుకునే వెసులుబాటు ఉందన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు ఇప్పటిదాకా సుమారు రూ.100కోట్ల పరిహారం అందజేసినట్టు చెప్పారు.

సూత్రధారులెవరో!

- ఇసుక దొంగతనం వ్యవహారంలో ముందుకు కదలని విచారణ
- చర్యలకు ఏవేవో కారణాలు చెప్తున్న రెవెన్యూ అధికారులు


ఇసుక లోడ్ చేసిన లారీని జామాయిల్ తోటలో దాచిన దృశ్యం (పాత చిత్రం)

ఎటపాక, ఆగస్టు 21: వారం క్రితం గుండాల ఇసుక డంప్-2 వద్ద ఇసుకను దొంగతనంగా లారీలో లోడ్ చేసుకుని రవాణా చేస్తూ పట్టుబడిన తెలంగాణకు చెందిన ఇసుక లారీ వెనుక సూత్రధారులు ఎవరనేది రెవెన్యూ అధికారులు ఇంకా తేల్చలేదు. ప్రభుత్వ ఇసుకను దొంగతనం చేసి వారం కావస్తున్నా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. అయితే ఇసుక దొంగతనం వ్యవహారాన్ని దగ్గరుండి నడిపించింది రెవెన్యూ శాఖలోని ఇంటి దొంగల పనేనా... లేక రాజకీయ పార్టీల నాయకుల ప్రోద్బలంతో కొందరు తెర వెనుక ఉండి నడిపించినట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారం కిందట గుండాల ఇసుక డంప్-2 నుంచి దొంతనంగా లోడ్ చేసుకుని లారీని ఒడిసా వైపు తరలిస్తుండగా నెల్లిపాక వద్ద కొందరు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించిన విషయం విదితమే. ఆ రోజున ఇసుక డంప్-2లో లారీలో ఇసుక లోడ్ చేస్తుండగా ఓ విలేకరి వీడియో తీశాడు. స్థానిక రెవెన్యూ సిబ్బంది ఒకరు ఈ వ్యవహారంలో భాగస్వామి అయి తానే దగ్గరుండి నడిస్తున్నట్టుగా ఇసుక లారీని ఎందుకు వీడియో తీస్తున్నావు అంటున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా ఇసుక లోడింగ్‌కు లోడ్‌కు వినియోగించిన ఎక్స్‌కవేటర్ దొరికినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం లారీని మాత్రమే పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై అనేక ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే నిజాలు నిగ్గుతేలే అవకాశం ఉంది. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దారు పృధ్వీని వివరణ కోరగా... ఆ సమయంలో తాను విధుల్లో లేనన్నారు. లారీని తనకు అప్పగించిన తహసీల్దారు బదిలీ అయ్యారని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చదువుకోమని మందలించారని విద్యార్థిని బలవన్మరణం


సుష్మశ్రీదేవి (పాత చిత్రం)

కరప, ఆగస్టు 22: చదువుకోమని మందలించిన పాపానికి ఆ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడి కుటుంబ సభ్యులకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురుకు చెందిన పడాల సుష్మ శ్రీదేవి (19) కోరంగి కేజీపీటీ కళాశాలలో ఫార్మ్-డి చదువుతోంది. చదువులో వెనుకబడుతోందనే ఉద్దేశంతో తల్లి ఆదిలక్ష్మి కుమార్తెను మందలించి బాగా చదువుకోవాలని చెప్పేది. దీంతో మనస్థాపం చెందిన సుష్మ శ్రీదేవి తల్లిని బెదిరిద్దామని ఈ నెల 20వ తేదీ ఉదయం గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి వేరొక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఒక్కగానొక్క కూతురు తమను అర్ధంతరంగా వదిలి వెళ్లిపోవడంతో ఆమె తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తూపాటి రామకృష్ణ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్, ఆగస్టు 22: తుని, హంసవరం స్టేషన్ల మధ్యలో రైలు ఢీకొనడంతో సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని తుని రైల్వే పోలీసులు పరిశీలించి మృతుడి వివరాల కోసం అన్వేషించగా ఎటువంటి గుర్తులు లేవు. నీలం రంగు టీషర్ట్, నీలం రంగు జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ: వ్యక్తి మృతి


మృతుడు మణికంఠ (పాత చిత్రం)

తాళ్లరేవు, ఆగస్టు 22: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ రాఘవేంద్రపురం 216 జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి... కాజులూరు మండలం జగన్నాథగిరికి చెందిన జగ్గపు మణికంఠ (30) మట్లపాలెం మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. చేతికి కడియం వేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రాఘవేంద్రపురం వద్ద 216 జాతీయ రహదారిపై ఎదురుగా యానాం నుంచి వస్తున్న లోడు లారీ ఢీకొట్టింది. మణికంఠకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

హార్లిక్స్ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐక్య కూటమిదే విజయం

ధవళేశ్వరం, ఆగస్టు 22: హార్లిక్స్ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐదు యూనియన్లు ఐక్య కూటమిగా పోటీ చేసి విజయం సాధించారు. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 965 ఓట్లు పోలయ్యాయి. ఐఎన్టీయూసీ, టీఎస్టీయూసీ, గోదావరి జీఎస్‌కే, జీఎస్‌కే హార్లిక్స్ వర్కర్స్ యూనియన్, చైతన్య ఎంప్లాయిస్ యూనియన్ ఐక్యంగా పోటీ చేసి 729 ఓట్లు పొంది ఘన విజయం సాధించాయి. సీఐటీయూ అనుబంధ ఎస్‌టీసీటీ ఎంప్లాయిస్-వర్కర్స్ యూనియన్‌కి 234 ఓట్లు మాత్రమే వచ్చాయి. రెండు ఓట్లు చెల్లవివిగా నమోదయ్యాయి.

డాక్టర్ రామారెడ్డికి యోగా థెరపీలో పీహెచ్‌డీ పట్టా



రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 22: పుదుచ్చేరిలో గురువారం జరిగిన శ్రీబాలాజీ విద్యాపీఠ్ డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టర్ కర్రి రామారెడ్డికి యోగా థెరపీలో పీహెచ్‌డీని చాన్సలర్ రాజగోపాలన్ ప్రదానం చేశారు. యోగా థెరపీలో పీహెచ్‌డీ దేశంలోనే ఇదే మొదటిది. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ శాల్యుటో జెనిసిస్ అండ్ కాంప్లిమెంటరీ మెడిసిన్ ఐఎస్‌సీఎం డైరెక్టర్, యోగాచార్య ప్రొఫెసర్ ఆనంద్ బాలయోగి భవనాని.. డాక్టర్ రామారెడ్డికి పెరల్ ఆఫ్ ఐఎస్‌సీఎం (ఇనిస్టిట్యూట్ ఆణిముత్యం) అవార్డు అందజేశారు.

మండపేటలో 'కమిటీ కుర్రాళ్లు'

సప్తగిరి థియేటర్లో చిత్ర బృందం సందడి

మండపేట, ఆగస్టు 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో 'కమిటీ కుర్రాళ్లు' చిత్ర బృందం గురువారం సందడి చేసింది. సినిమా హిట్ కావడంతో ఆ ఆనందాన్ని ప్రేక్షకులతో పంచుకోవడానికి యూనిట్ సభ్యులు సప్తగిరి థియేటర్‌కు వచ్చారు. నిర్మాత కొణిదల నిహారిక, నటులు ప్రేక్షకులతో ముచ్చటించారు. డైరెక్టర్ యదువంశీ షూటింగ్‌కు సంబంధించిన విషయాలను పంచుకున్నారు. సప్తగిరి థియేటర్ యాజమాన్యం మల్లిపూడి గణేష్, ముత్యాల రామకృష్ణ తదితరులు చిత్ర యూనిట్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజరు సుందరం, మల్లేశ్వరరావు, మెగా ఫ్యామిలీ యువత అధ్యక్షుడు కొంత నాగేంద్రప్రసాద్, మోరం బాలాజీ, శెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నిర్మాత నిహారిక

ఏజెన్సీ సమాచారం

ఈ ఎంఈవో మాకొద్దు!





సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ పెంటయ్య, ఎంఈవోపై గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలు

కూనవరం, ఆగస్టు 22: కూనవరం మండల సర్వసభ్య సమావేశం గురువారం గరంగరంగా జరిగింది. అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ పనిచేసి సస్పెండ్ అయిన ఎంఈవో లక్ష్మీనారాయణను మళ్లీ కూనవరం బదిలీ చేయడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పట్లో ఆయన ఉపాధ్యాయుల భీమా పాలసీ డబ్బులు వాడుకోవడం, స్కూల్ గ్రాంటుతో పాటు ఉపాధ్యాయుల దగ్గర డబ్బులు వసూలు చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు వచ్చా యి. స్పందించిన అధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. అనంతరం చింతూరులో విధులు నిర్వర్తించారు. మరలా కూనవరానికి ఇన్‌చార్జిగా రావడంతో ఆ ఎంఈవో మాకొద్దంటూ వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య తీర్మానం ప్రవేశపెట్టారు. మండలంలో పాఠశాలల భవనాలు వర్షాలకు తడుస్తున్నాయని, విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోందని సభ్యులు ఆరోపించారు. ఒకే సర్వే నెంబరు భూమిని ఇద్దరికి కేటాయించడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. మండలంలో రహదారులకు కలెక్టర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ అటవీ అధికారుల నుంచి సమస్యలు వస్తున్నాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. గతంలో వచ్చిన వరదలకు కూలిన ఇళ్లకు పరిహారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో లక్ష్మీరెడ్డి సభ్యులకు సరైన అవకాశం ఇవ్వట్లేదని అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పశువులు రోడ్లపై ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో తహసీల్దారు నాగబాబు, ఎంపీపీ రంగమ్మ, మేజర్ పంచాయతీ ఈవో సురేష్, సర్పంచ్ హేమంత్‌నాయుడు, ఉపాధి ఏపీవో శ్రీకాంత్, వైస్ ఎంపీపీ బందారు సాంబశివరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సభల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి: ఐటీడీఏ పీవో సింహాచలం



రంపచోడవరం, ఆగస్టు 22: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం గ్రామసభల నిర్వహణకు శుక్రవారం చర్యలు చేపట్టినట్టు ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం తెలిపారు. గురువారం ఆయన తన చాంబరులో మాట్లాడుతూ గ్రామ సభల కు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను గ్రామసభల్లో తీర్మానిస్తామని చెప్పారు.

నేటి నుంచి కొండరెడ్ల గ్రామాల్లో సదస్సులు

రంపచోడవరం, ఆగస్టు 22: ఏజెన్సీ గ్రామాల్లో కొండరెడ్ల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి జన్‌మన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం నుంచి సెప్టెంబరు పదో తేదీ వరకు సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం తెలిపారు. ప్రధానంగా ఆధార్ కార్డు నమోదు, జన్‌ధన్ ఖాతాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరేందుకు దోహదపడుతుందన్నారు.

రాజవొమ్మంగి తహసీల్దారుగా సత్యనారాయణ



రాజవొమ్మంగి. ఆగస్టు 22: రాజవొమ్మంగి తహసీల్దారుగా కరక సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. దేవీపట్నం తహసీల్దారుగా చేసిన ఆయన ఎన్నికల సమయంలో కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. మరలా ఇక్కడకు వచ్చారు. డిప్యూటీ తహసీల్దారు అల్లు సత్యనారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దారుకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.



కూనవరం తహసీల్దారుగా నాగబాబు

కూనవరం, ఆగస్టు 22: కూనవరం తహసీల్దారుగా నాగబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో రెవెన్యూపరమైన సమస్యలను ప్రజలు తన దృష్టికి తేవాలని కోరారు.

మారేడుమిల్లి తహసీల్దారుగా సుబ్బారావు

మారేడుమిల్లి, ఆగస్టు 20: మారేడుమిల్లి తహసీల్దారుగా గా కారం సుబ్బారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా నాగాయిలంక నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తహసీల్దారుకు డిప్యూటీ తహసీల్దారు బాలాజీ, ఆర్ఐ ఏసుబాబు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం: సీఐ కన్నపరాజు



ఎటపాక, ఆగస్టు 22: ఎటపాక సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే తన ధ్యేయమని, ఆ దిశగా చర్యలు తీసుకుంటానని సీఐ ఎం.కన్నపరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన ఎటపాక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లో కోడి పందాలు, పేకాట, జూదాలు నిర్వహిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీ విధానం అమల్లో ఉందని, ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించామని, వాటిపై నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. వాటిపై సమాచారం ఉంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

మొక్కలు నాటిన ఎంపీపీ, రేఖపల్లి సర్పంచ్

వర రామచంద్రాపురం, ఆగస్టు 22: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాలతో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని రేఖపల్లిలో గురువారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, సీపీఎం మండల నాయకులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో పెట్టాలి'

అడ్డతీగల, ఆగస్టు 22: అడ్డతీగల జిల్లా పరిషత్ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ తీగల ఇంద్రాదేవి సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె కార్యవర్గ సభ్యులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. వైస్ చైర్మన్ రామకృష్ణ, టీడీపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు యడ్ల శ్రీను, జనసేన పార్టీ నాయకులు జయరాం, పొడుగు సాయి తదితరులు పాల్గొన్నారు.

'దోషులను కఠినంగా శిక్షించాలి'

మారేడుమిల్లి, ఆగస్టు 23: కోలకతాలో జూనియర్ డాక్టరు మౌమితపై జరిగిన అమానుష ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని కుల, మత రాజకీయాలకు అతీతంగా ప్రజలు, యువత డిమాండ్ చేశారు. మారేడుమిల్లి పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ కొండా జాకబ్, జడ్పీటీసీ బాలాజీబాబు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు బొశెట్టి అప్పాజీ, జనసేన మండల శాఖ అధ్యక్షుడు మల్లా దుర్గాప్రసాద్, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

మోతుగూడెం, ఆగస్టు 22: ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏడీఈ కొండబాబు, ఏఈ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో మోతుగూడెంలో పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. ప్లాంట్ అటెండరు ఇమ్మంది నరసింహమూర్తి, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

సాంకేతికలోపంతో నిలిచిపోయిన లారీ

మోతుగూడెం, ఆగస్టు 22: రాజమహేంద్రవరం వైపు నుంచి భద్రాచలం వైపు భారీ లోడుతో వెళ్తున్న లారీ సాంకేతిక లోపంతో మారేడుమిల్లి మండలం వాలమూరు సమీపంలో ప్రమాదకర మలుపులో అడ్డుగా నిలిచిపోయింది. పక్క కొంచెం ఖాళీ ఉండడంతో చిన్న వాహనాలు వెళ్లే అవకాశం ఉంది. భారీ వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి.

బీసీ హాస్టల్ వార్డెన్ సుబ్బారావుకు పదోన్నతి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22: రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని బీసీ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేస్తున్న ముత్యాల సుబ్బారావును రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతిపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం డివిజన్ సహాయ బీసీ వెల్ఫేర్ అధికారిగా నియమించింది. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం ఆయన వెంటనే రిలీవ్ అయి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్‌గా విధి నిర్వహణలో తనకు సహకరించిన బీసీ సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

సేంద్రీయ సాగుతో ప్రయోజనాలు మెండు

» జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



రాజవోలులో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 22: సేంద్రీయ వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని రాజవోలులో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేంద్రీయ పద్ధతిలో రైతులు పండించిన ధాన్యాన్ని 126 దేశాల్లో ఐఎన్‌డీ గేప్ సర్టిఫికేషన్ ద్వారా అమ్ముకొనే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిదన్నారు. సేంద్రీయ సాగుపై మెళకువలను రైతులకు వివరించారు. డాట్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రస్తుతం వరిలో ఆశించే చీడపీడలు, తెగుళ్ల గురించి రైతులను అడిగి తెలుసుకొని వరి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా నీమస్త్రం తయారీ, ఉపయోగించే విధానాన్ని రైతులకు తెలిపారు. వరిలో రసం పీల్చే పురుగు, పేనుబంక, తామర పురుగు, ఎర్రనల్లి, తెల్లదోమను గుడ్డుదశలో నియంత్రించడానికి నీమస్త్రం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో భీమారావు, విస్తరణాధికారి పీటర్, వీఏఏలు, ఈహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

46 హోమియో పీజీ సీట్లు తీసుకొచ్చాం

» అప్పటి బూతుల మంత్రి, కమీషన్ స్టార్ పట్టించుకోలేదు

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 22: గత ప్రభుత్వ చేతకానితనం వల్ల రాష్ట్రంలో రెండు హోమియో కళాశాలకు చెందిన 46 పీజీ సీట్లు కోల్పోయే పరిస్థితి వచ్చినప్పుడు తాము స్పందించి వాటిని తిరిగి శాంక్షన్ చేయించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియోకళాశాలలో 23 పీజీ సీట్లు, గుడివాడ హోమియో కళాశాలలో 23 పీజీ సీట్లును కోల్పోయేలా ఉన్నామని ప్రిన్సిపాల్ తన దృష్టికి తీసుకొచ్చారని వెంటనే తాను స్పందించి ఈ విషయాన్ని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి చెప్పామన్నారు. ఆమె కేంద్రంతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపించారని చెప్పారు. బూతుల మంత్రి కొడాలి నానికి గాని, కమీషన్ స్టార్ భరత్‌రామ్‌కు గాని విద్యార్థుల భవిష్యత్ కనిపించలేదన్నారు. ఈట్‌స్ట్రీట్, ట్రంక్ సెంటర్ నిర్మాణాల్లో వచ్చినట్లుగా కమిషన్ రాదు కాబట్టే హోమియో కళాశాల పీజీ సీట్ల విషయంలో నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. ఇక అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో ప్రమాదం దురదృష్టకరమన్నారు. గతంలో వైజాగ్ పాలిమర్ పరిశ్రమలో ప్రమాదం జరిగినప్పుడు గత ప్రభుత్వం థర్డ్ పార్టీ ఆడిట్, సేఫ్టీ ఆడిట్‌పై జగన్ ప్రభుత్వం శ్రద్ధ వహించి ఉంటే పరిశ్రమల్లో లోటుపాట్లు ముందే తెలిసి ఉండేవని, అలాంటిదేమి చేయకపోవడంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇక జగన్ హయాంలో పఫ్‌లు తినడానికే రూ.4 కోట్లు ఖర్చు చేశారంటే ప్రజాధనాన్ని ఎంత దారుణంగా వృధా చేశారో అర్థమవుతుందన్నారు. సమావేశంలో ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, జాంపేట బ్యాంక్ చైర్మన్ బొమ్మన జయకుమార్, వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్ కనకం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



పాతవీరంపాలెంలో ఆయిల్‌పామ్ మొక్క నాటిన ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, ఆగస్టు 22: కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పాతవీరంపాలెంలో పతంజలి ఫుడ్స్, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆయిల్‌పామ్ తోటల విస్తరణ కార్యక్రమంలో భాగంగా రైతు ఉద్దండ్రావు వీరసత్యనారాయణ పొలంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళతామన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతుల సమస్యలను, ఇన్సూరెన్స్ విషయాలపై దృష్టి సారించాలని కోరారు. పతంజలి ఫుడ్స్ పెద్దాపురం డీజీఎం డి.రవీంద్ర మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో వచ్చే లాభాలు, మార్కెటింగ్ సౌలభ్యం, చెల్లింపులను రైతులకు వివరించారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.దుర్గేష్ మాట్లాడుతూ బిందు సేద్య పద్ధతిలో ఆయిల్‌పామ్ సాగు, వ్యయం, దిగుబడి, డ్రిప్ పరికరాల లభ్యత, రాష్ట్ర ప్రభుత్వ రాయితీ తదితర అంశాలను వివరించారు. జిల్లా ఉద్యాన అధికారిణి బి.సుజాతకుమారి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కల లభ్యత, ఎరువులు, ప్రభుత్వాల రాయితీలను వివరించారు. అనంతరం ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీవీవీ సత్యనారాయణ, టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు ఎలుగుబంటి సత్తిబాబు, ఎం.సాయిరాం, ఎంపీటీసీ ఉద్దండరావు శ్రీనివాసరావు, సిరసపల్లి నాగేశ్వరరావు, ఎంవీవీ సత్యనారాయణ, ఉద్యాన అధికారిణి కె.దివ్యశ్రీ, రైతులు, పతంజలి, ఏపీఎంఐపీ సిబ్బంది పాల్గొన్నారు.

'కమిటీ కుర్రోళ్లు' సందడి



రాజమహేంద్రవరం కల్చరల్/రాజానగరం, ఆగస్టు 22: ఈ నెల 9న విడుదలైన కమిటీ కుర్రోళ్లు సినిమాను ఆదరిస్తున్న రాజమహేంద్రవరం ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని సినీ ప్రొడ్యూసర్, నటి నీహారిక, దర్శకుడు యదువంశీ అన్నారు. కమిటీ కుర్రోళ్లు సినిమా విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సినిమా బృందం రాజమహేంద్రవరంలోని అనుశ్రీ థియేటర్‌కు, రాజానగరం మండలం తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లింది. నిర్మాత, దర్శకుడు మాట్లాడుతూ ఈ చిత్రాన్ని మొత్తం గోదావరి పరివాహక ప్రాంతాల్లోను, అమలాపురం పరిసర ప్రాంతాల్లోను తీయడం వల్ల గోదావరి అందచందాలకు ప్రేక్షకులు జేజేలు పలుకుతున్నారని, ముఖ్యంగా రాజమండ్రిలో మంచి ఆదరణ లభించిందన్నారు. చిత్ర క్యాస్టింగ్ యూనిట్ సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, త్రినాథ్ వర్మ, ఈశ్వర్ రాచిరాజు, ప్రసాద్ బెహరా, శ్యాం కళ్యాణ్, పరిమి లోకేశ్‌కుమార్, రఘువరన్, అక్షయ శ్రీనివాస్, శివకుమార్ మట్టా, తేజస్విరావు ఈ సినిమాలోని డైలాగ్స్ వినిపించారు. ఇంజనీరింగ్ కళాశాలలో సక్సెస్ మీట్ అనంతరం మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన



పుష్కరఘాట్‌లో నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22: కోల్‌కత్తాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార సంఘటనను నిరసిస్తూ గురువారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్‌లో తూర్పుగోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సెక్రటరీ లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు శ్రీనివాసరావు, మహిళా కౌన్సిల్ సభ్యురాలు స్వాతి మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా ఇంతటి హేయమైన సంఘటనలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు కీర్తన, ఉషారాణి, తులసి, మురళీకృష్ణ, మురళి, వెంకటేశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ నిరసన ప్రదర్శనకు రాజమహేంద్రి ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు సంఘీభావం తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి నాగ సర్పాలు

అనపర్తి, ఆగస్టు 22: అనపర్తిలోని వీర్రాజు మామిడి వద్ద వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరునికి ధవళేశ్వరం గ్రామానికి చెందిన వీర్రాజు కుటుంబ సభ్యులు భక్తులు వెండి నాగ సర్పాలను బహూకరించారు. గురువారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి సమర్పించే నాగ సర్పాలను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు తమలంపూడి వీర్రాఘవరెడ్డి, వెలగల గంగిరెడ్డి, మండ రామారెడ్డి, మండ పోతారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

అండర్-15 చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 22: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న ఎంకే చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అండర్-15 బాలబాలికల చదరంగం పోటీలు స్థానిక ది రాజమండ్రి ఐరన్ అండ్ హార్డ్‌వేర్ పెయింట్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్టు జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన నలుగురు బాలబాలికలు జిల్లా తరపున రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీదారులు 1.1.2009 ముందు జన్మించి ఉండాలని, పూర్తి వివరాలకు, 24వ తేదీ లోగా తనను సంప్రదించాలని కుమార్ చెప్పారు.

బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ్

రంగంపేట, ఆగస్టు 22: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఈలకొలను గ్రామానికి చెందిన అంచూరి అరుణ్‌కుమార్ నియమితులైనట్టు ఆయనే స్వయంగా తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యాయంలో జరిగిన సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య.. అంచూరి అరుణ్‌కుమార్‌ని నియమించినట్టు తెలిపారు. బీసీ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న అరుణ్‌కుమార్‌ను జాతీయ సంఘంలోకి తీసుకున్నట్టు చెప్పారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, బీసీ సమస్యలపై పోరాడతానన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పెంకే మహేష్, విశాఖపట్నం జిల్లా ఉపాధ్యక్షుడు పితాని అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ సీఐగా సత్యకిషోర్



కోరుకొండ, ఆగస్టు 22: కోరుకొండ సీఐగా వై.సత్యకిషోర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. భీమవరం రూరల్ సీఐగా పని చేస్తూ బదిలీపై కోరుకొండకు వచ్చారు. ముందుగా స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన సర్కిల్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐను కోరుకొండ ఎస్ఐ ఆనంద్ కుమార్, గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. అలాగే జనసేన మండలాధ్యక్షుడు అడ్డాల శ్రీను సీఐను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సత్యకిషోర్ మీడియాతో మాట్లాడుతూ గంజాయి, జూదం, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కోరుకొండలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

అన్న క్యాంటీన్‌కు రైతు విరాళం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 22: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్ నిర్వహణ నిమిత్తం రైతుబజార్‌కు చెందిన రైతు ప్రభుత్వానికి రూ.10 వేలు విరాళం అందించారు. గురువారం స్థానిక క్వారీసెంటర్ రైతు బజార్‌లో వ్యాపారం చేసే రైతు అంగరపు శ్రీను(కూనవరం) స్థానిక తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు రూ.10 వేల అందించారు. ఈ సందర్భంగా శ్రీనును ఎమ్మెల్యే అభినందించారు.

ప్రపంచ జానపద దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 22: జీవన సమరంలో సుఖదు:ఖాలను బాణీలుగా చేసుకొని, వెలసిన పాటలే జాన పదాలని వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. సంహిత డిగ్రీ కళాశాల, కళాగౌతమి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జానపద పల్లె పాటలు, విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచేవిగా ఉండేవని తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ మాట నుంచి పాట ఉద్భవిస్తే, పాటకు సంగీతం జత కలిసి కళగా రూపాంతరం చెందిందని అన్నారు.

చిరంజీవి పుట్టినరోజు వేడుకలు



కడియం, ఆగస్టు 22: చిరు సేవాసమితి జిల్లా నాయకుడు గెడ్డం శివ ఆధ్వర్యంలో గురువారం చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. రాజమహేంద్రవరం చెవిటి, మూగ, పిల్లల ఆశ్రమంలో చిన్నారులచేత కేకు కట్ చేయించారు. దీనికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ రాజమహేంద్రవరం కార్పొరేషన్ అధ్యక్షుడు వై.శ్రీను విచ్చేసి శివ సమకూర్చిన యూనిఫామ్స్‌ను చిన్నారులకు అందజేశారు.

రాజమహేంద్రవరం కల్చరల్: సినీ అభిమానం సేవ రూపంలో చూపించడం శుభ పరిణామమని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. సినీ నటుడు చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా చిరంజీవి బస్టాండ్ వ్యవస్థాపకుడు పడాల శ్రీనివాసు నిర్వహిస్తున్న వారోత్సవాలు గురువారం ముగిశాయి. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ దివ్యాంగులకు వీల్‌చైర్లు, చెవిటి మిషన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ హీరో అభిమానాన్ని సేవా రూపంలో చూపిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో చిరుకూరి వీర్రాజు, చిక్కాల బాబులు, ఆనంద్, నిడదవోలు వెంకటేశ్వరరావు, దేసినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

రంగంపేట, ఆగస్టు 22: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు సర్పంచ్ అధ్యక్షతన ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.వెంకటరత్నం గురువారం తెలిపారు. ఈ సభల్లో ఉపాధి హామీ పథకంలోని వేతనదారులకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించడం, ఇప్పటికే మంజూరైన పనులు వాటి ప్రగతి చదివి వినిపించడం, 2024-25 ఆర్థిక సంవత్సరానికి కొత్త పనులు ప్రతిపాదంచడం, సామాజిక తనిఖీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారన్నారు. సభలకు పంచాయతీ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ కూలీలు, సంబంధిత అధికారులు హాజరవుతారని ఎంపీడీవో చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుబంధం చేయడంతో పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్థక, మత్స్యశాఖ, వైద్యఆరోగ్య వెలుగు తదితర శాఖలకు అవసరమైన పనులకు ఈ సభల్లో ఆమోదం తెలుపుతారన్నారు. గ్రామ సభల సక్రమ నిర్వహణ, పర్యవేక్షణకు మండల స్థాయి అధికారులను నియమించినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పలువురు మంత్రులకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల వినతి



మంత్రులు అనిత, రామానాయుడులకు వినతిపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఆగస్టు 22: రాజానగరం నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం అమరావతిలో వివిధ శాఖల మంత్రులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశారు. నీటి పారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి వ్యవసాయ పంట కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, సూరంపాలెం రిజర్వాయర్ కాలువ పనులు, గాదరాడ లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ, బొబ్బిల్లంక పంపింగ్ స్కీమ్ రెండోసారి టెండర్ పిలిచేందుకు పరిపాలన ఆమోదం, బొబ్బిల్లంక నుంచి పురుషోత్తపట్నం వరకు గోదావరి బండ్ రోడ్డు అభివృద్ధి పనులపై చర్చించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి గత ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిపోయాయని, మహిళలకు రక్షణ కరువైందని, గంజాయి రవాణా, సాగు కట్టడిచేసి యువత భవిష్యత్తును కాపాడాలని కోరారు. అలాగే పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజను కలిసి తాగునీరు, మంచినీటి పైపులైన్లు, ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఆర్ ట్యాంకుల నిర్మాణం, రోడ్లు డ్రైనులు, డంపింగ్ యార్డులు, వీధిలైట్లు, విద్యుత్ స్తంభాలు, పారిశుధ్య నిర్వహణ పనులకు సంబంధించిన సమస్యలు తక్షణమే పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు.

సెప్టెంబరు 28న నన్నయలో జాతీయ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 22: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సెప్టెంబరు 28న శ్రీ గురు విశ్వస్ఫూర్తి రచనలు- ఆధునిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం అనే అంశంపై తెలుగు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచరును గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నన్నయ వర్శిటీ తెలుగుశాఖ, స్ఫూర్తి కుటుంబం- ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సుకు తెలుగు భాషాభిమానులు, సాహిత్యవేత్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సదస్సు కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ గురువిశ్వస్ఫూర్తి రచనలలోని వివిధ దృక్పథాలపై వ్యాసపత్రాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.రజనీకాంత్, వి.సదాశివరావు. టీవీఎస్ ప్రసాద్, కేవీఎన్‌డీ వరప్రసాద్, డి.లక్ష్మీనరసమ్మ, వీబీ సంజీవరావు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


రాజమండ్రి బార్ అసోసియేషన్

రాజమహేంద్రవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన శోచనీయమని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ న్యాయవాదులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆధారాలను మాఫీ చేసే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఆ రాష్ట్ర సీఎం ఒక మహిళ అయినప్పటికీ మరో మహిళపై జరిగిన అతి దారుణమైన ఘటనపై తక్షణమే చర్యలు తీసుకోకుండా కేసును తప్పుదోవ పట్టించడం హేయమన్నారు. సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప, ప్రధాన కార్యదర్శి పెళ్లూరి రమేష్, కోశాధికారి కర్ర హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: డబుల్ ఇస్మార్ట్
సూర్యామినీ	: ఏలియన్
సూర్యాప్యాలస్	: డిమోంటీ కాలనీ-2
స్వామి	: డిమోంటీ కాలనీ-2
శివజ్యోతి	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
అనుశ్రీ(సాయికృష్ణ)	: కమిటీ కుర్రోళ్లు
రాజా	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
ఊర్వశి	: డబుల్ ఇస్మార్ట్
రంభ	: ఇంద్ర
మేనక	: రేవు, స్త్రీ-2
అప్సర	: మిస్టర్ బచ్చన్
కుమారి	: ఏలియన్, పరాక్రమం
అశోక	: ఆయ్
వీఎస్ మహల్(నామవరం)	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ఆయ్
వెంకటసూర్య(కడియం)	: తంగలాన్,ఆయ్
సత్యగౌరి (అనపర్తి)	: ---
సూర్యశ్రీ (అనపర్తి)	: ---
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: ఆయ్
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: ---
శ్రీనివాస (గోకవరం)	: ---
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ---
లలితామహల్(రంపచోడవరం)	: ---
నవయుగ(చింతూరు)	: -----



బాబొస్తున్నారు..

నేడు కొత్తపేట మండలం వానపల్లిలో గ్రామసభ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలిసారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించడానికి శుక్రవారం రానున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని వానపల్లి గ్రామంలో జరిగే రెవెన్యూ గ్రామసభకు హాజరుకానున్నారు.



క్వారీసెంటర్‌లో నిర్మించిన పార్లమెంట్ నమూనా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

అంబేడ్కర్ ఆలోచన విధానాలతోనే ముందుకు

రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు22: తన ఊపిరి ఉన్నంత వరకు భారత రాజ్యాంగానికి లోబడి పనిచేస్తానని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంతో కూడిన పార్లమెంట్ నమూనా భవన్‌ను గురువారం రాత్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తొలుత మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీఎం.సత్యవేణి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీనులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకువెళ్లడంలో కూటమి ప్రభుత్వం ముందుండి పనిచేస్తుందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామన్నారు. రాజ్యాంగానికి అనుకూలంగానే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. గత ఐదేళ్లపాటు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని వైసీపీ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. జగన్‌రెడ్డి, అతని తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేశాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి లోబడి పనిచేస్తున్నామన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజలు వైసీపీతోనే ఉన్నారని ఆ పార్టీ అపోహపడిందని, కానీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయా డివిజన్లలో అత్యధిక మెజార్టీ కూటమికి ఇచ్చారని గుర్తుచేశారు. అంబేడ్కర్ వంటి గొప్పవారిని స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అంబేడ్కర్ విగ్రహాలను పెట్టుకుంటున్నాం కానీ ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా పోరాటడమే ఆ మహనీయునికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, ఎస్సీసెల్ అధ్యక్షుడు చాపల చిన్నరాజు, బేసరి చిన్ని, లీగల్ సెల్ నాయకులు రాచపల్లి ప్రసాద్, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ మరుకుర్తి రవియాదవ్, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, తెలుగు మహిళానగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ కప్పల వెలుగుకుమారి, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, సింహా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇదో చరిత్ర!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- నేడు గ్రామ సభలు
- జిల్లాలోని 300 పంచాయతీల్లోనూ ఉదయం 9 గంటల నుంచి సభలు
- ప్రజలందరూ రావాలి.. సమస్యలు చెప్పాలి
- ఇదే సభలో పంచాయతీ పరిధిలోని అన్ని సమస్యల పరిష్కారానికి తీర్మానం
- నేడు రూ.1000 కోట్ల పనుల వరకూ తీర్మానం చేసే అవకాశం
- కాటకోటేశ్వరం సభలో పాల్గొననున్న మంత్రి కందుల, కలెక్టర్ ప్రశాంతి
- ఉపాధి హామీ పనులూ నిర్ణయం

కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల చరిత్రలో ఓ సువర్ణాధ్యాన్ని లిఖించనుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి జిల్లాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ గ్రామ సభలు నిర్వహించనున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా వానపల్లిలో జరిగే గ్రామసభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా హాజరుకానున్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్ని గ్రామ పంచాయతీల్లో నిబంధనల ప్రకారం ఏడాదికి నాలుగుసార్లు మహాజన సభలు జరగాలని చెప్పిన సంగతి తెలిసిందే. గతంలో ప్రతీ ఏటా నాలుగు సభలు నిర్ణీత సమయాల్లో జరగాల్సిఉండగా, పంచాయతీ అధికారులు, స్థానిక పాలకులు కుమ్మక్కై, తూతూమంత్రంగా నిర్వహించి ఇష్టానుసారం తీర్మానాలు చేసుకుని పంచాయతీ సొమ్మును దోచుకునేవారు. ఇక కూటమి ప్రభుత్వం వాటిని సాగనీయమని చెబుతోంది. అందుకే కచ్చితంగా గ్రామసభలు గ్రామ ప్రజల సమక్షంలోనే జరగాలని, గ్రామాల్లో అసలు ఏమి జరుగుతుందో కూడా అందరికీ తెలియాలనే ఈ సభల ఉద్దేశం. గతంలో గ్రామాల్లో రాజకీయాల వల్ల కొన్ని సమస్యలు పరిష్కారం కావు. పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, కంపోస్టు యార్డులు, వీధి లైట్లు లేకపోవడం గోతుల్లో నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. అంతేకాక ఉపాధి హామీ పథకం ద్వారా అనేక పనులు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ సభల్లో ప్రజల నిత్యజీవనానికి ఇబ్బందికరంగా ఉన్న సమస్యలను కూడా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, గ్రామ సమస్యలను పట్టించుకోకపోవడం, చెట్లు, షాపులు, చెరువుల లీజు వ్యవహారాల్లో లోపాలు అన్ని ఇక్కడ ప్రస్తావన కొచ్చే అవకాశం ఉంది. ప్రజలు ఏ సమస్యనైనా ఇక్కడ లేవనెత్తవచ్చు.

గ్రామాల్లో సామాజిక అవసరాలు..

ప్రతీ గ్రామంలో మంచినీటి సరఫరా పథకాలు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు ఉండాలి. లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధి లైట్లు, సిమెంట్ రోడ్లు, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ వంటివన్నీ ఏర్పాటుచేయాలి. ఇప్పుడు వాటిని అభివృద్ధి చేయాలనేదే ఈ సభల ఉద్దేశం. అన్ని గ్రామాలకు దగ్గరలోని ప్రధాన మార్కెట్‌లో అనుసంధాన రోడ్లు ఉండాలి. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి సంస్థ వీటిని కల్పించాలి. గ్రామ పంచాయతీలోని ఇంటర్నల్ రోడ్లు, లింక్ రోడ్లు, గ్రామాలను, మండలాలను కలిపే రోడ్లు కూడా నిర్మిస్తారు. స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో వీటిని అభివృద్ధి చేస్తారు. ఈ గ్రామసభల్లో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు కూడా పాల్గొంటారు. జిల్లాలోని నిడదవోలు మండలంలో కాటకోటేశ్వరంలో శుక్రవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొంటారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఆయా నియోజకవర్గాల పరిధిలో పాల్గొంటారు.

ఉపాధి హామీ పనులూ వేగవంతం

ప్రతీ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల ఉపాధి కల్పించడం. పనికోరిన 15 రోజుల్లోనే పని చూపించడం, పనికోరిన తేదీ నుంచే నిరుద్యోగ భృతి ఇవ్వడం వంటి నిబంధనలు ఉన్నాయి. వ్యవసాయ అనుబంధ పనులు కూడా చేయవచ్చు. కొత్తగా ఫీడర్ కాలువలు నిర్మించడం, పంట కాలువలు నిర్మించడం, పొలంగట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో ఫార్మ్ పాండ్ నిర్మించడం, వ్యక్తిగత భూముల్లో భూమిని అభివృద్ధిచేయడం, సరిహద్దులో కందకాలు తవ్వుకోవడం, రైతు భూముల్లో గడ్డి పెంచుకోవడం, గొర్రెల షెడ్ల నిర్మాణం, కోళ్లఫారాలు, పశువుల షెడ్లు, పట్టుపురుగుల షెడ్‌ల నిర్మాణం, మల్లె, గులాబి వంటి పూలతోటలు పెంచడం, పండ్ల తోట్ల పెంపకం వంటి చేయవచ్చు. ఇలా 38 రకాల పనులకు ఉపాధి హామీ నిధులను అనుసంధానం చేశారు. ఇవన్నీ సభల్లో చర్చకు వస్తాయి.

గ్రామ ప్రణాళికలు రూపొందిస్తాం : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ గ్రామ ప్రణాళికలు రూపొందిస్తామని, సభలోనే తీర్మానం చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. జిల్లాలోని 300 గ్రామ పంచాయతీల్లోనూ ఉదయం పది గంటలలోపు సభలు మొదలు కావాలన్నారు. వీటికి స్పెషల్ ఆఫీసర్లను నియమించామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొంటారన్నారు. గ్రామాల్లోని నీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, వీధి దీపాలు, డ్రైనేజీ, రోడ్లు వంటి అన్ని రకాల సమస్యలను పరిష్కార దిశగా ఇక్కడ తీర్మానం చేస్తారని, విద్యుత్ కనెక్షన్లు, కుళాయి, మరుగుదొడ్డి, ఎల్‌పీజీ గ్యాస్, ఉపాధి హామీ పనులు వంటివన్నీ, ప్రజలు ఇచ్చిన ప్రతీ అంశాన్ని పరిశీలిస్తారని చెప్పారు.



అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

అడిషనల్ ఎస్పీగా సుబ్బరాజు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు)గా అల్లూరి వెంకట సుబ్బరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాలో ఎస్‌ఈబీలో విధులు నిర్వర్తిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక వ్యక్తులపై నిరంతర నిఘా పెడతామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఆ విధంగా ప్రేరేపించినా ఉపేక్షించేది లేదన్నారు. రాత్రి వేళల్లో గస్తీని విస్తృతంగా పెంచుతామని చెప్పారు. ఎస్పీ నరసింహ కిషోర్ పర్యవేక్షణలో జిల్లాలోని నేరాల అదుపునకు పటిష్ట చర్యలు చేపడతామని తెలిపారు.

నేటి నుంచి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 23వ తేదీ సాయంత్రం రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ ధర్మంచర హాలులో అరిపిరాల నారాయణరావు రూపొందించిన అంత్యానుప్రాస నిఘంటువు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 24వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకూ జాతీయరహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రముఖులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. 25న ఉదయం పది గంటలకు కాకినాడలో జరిగే ఒక సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం కాండ్రేగుల గ్రామంలో వంగవీటి మోహన రంగ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రాజమహేంద్రవరం చేరుకుని సాయంత్రం ఐదు గంటలకు ఎంపీ ఆఫీసులో అందుబాటులో ఉంటారు. 26వ తేదీ ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం క్వారీ ఏరియాలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా పార్టీ కార్యకర్తలతో జరిగే సమావేశంలో పాల్గొంటారని ఎంపీ కార్యాలయం వర్గాలు తెలిపాయి.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పలువురు మంత్రులకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల వినతి

మళ్లీ వాళ్లే..



- పాత కాంట్రాక్టర్‌తోనే సీనరేజీ వసూళ్లు
- వైసీపీ హయాంలో వాళ్ల ఇష్టారాజ్యం
- రోడ్ల మీద చెక్‌పోస్టులు పెట్టి దోచేశారు
- ఇంకా రూ.44 కోట్ల సీనరేజీ సొమ్ము బకాయి
- డూప్లికేట్ బిల్లులతోపాటు సీనరేజీ లూటీ
- సుధాకర్ ఇన్‌ఫ్రాకు అనుమతి.. ఫీల్డ్‌లో ఏఎంఆర్ స్టాఫ్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మైన్స్ సీనరేజీ వసూలు బాధ్యతను మళ్లీ సుధాకర్ ఇన్‌ఫ్రాకే మైన్స్ అధికారులు కట్టబెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం 2023 ఏప్రిల్ 18 నుంచి 2025 వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మైన్స్ సీనరేజ్ వసూలు కాంట్రాక్టును ఈ కంపెనీకి అప్పగించింది. అంతకుముందు మైన్స్ అధికారులే సీనరేజీ వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించేశారు. కానీ వైసీపీ దీనికో టోపిడీ మార్గాన్ని ఎన్నుకుని, సీనరేజి వసూలు బాధ్యతలను ప్రైవేట్ సంస్థల పేరుతో వైసీపీ నేతలకు సంబంధించిన సంస్థలకే అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ జరిగే అన్ని జిల్లాలోనూ ఇదే విధానం అమలుచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థకు ఇచ్చింది. కాకినాడలో గత ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన చలమలశెట్టి సునీల్ కుటుంబానికి చెందిన కంపెనీ ఇది. ఈ కంపెనీ పేరు మీదే ఒప్పందం జరిగినప్పటికీ- రావులపాలెం, కడప ప్రాంతాలకు చెందిన వైసీపీ వర్గీయులు, గోకవరం మండలానికి చెందిన ఓ వైసీపీ నేత సీనరేజి వసూలు చేశారు. నెలకు సుమారు రూ.10 కోట్లు వంతున రెండేళ్లలోనే రూ.233 కోట్లు చెల్లించేలా ఒప్పందం జరిగింది. మైన్స్ రకాన్ని బట్టి సీనరేజీ ఉంటుంది. గ్రావెల్, భవన నిర్మాణ మెటీరియల్స్, లేటరైట్, మట్టి.. ఇలా రకాన్ని బట్టి మినిమం సీనరేజీ చార్జీలు ప్రభుత్వానికి చెల్లించాలి. క్యూబిక్ మీటరు లెక్కన సీనరేజీ నిర్ణయిస్తారు. కానీ ఈ కంపెనీ పేరిట అనేక రోడ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి రాత్రీ పగలూ సీనరేజీ వసూలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు పట్టించుకోకుండా ఇష్టానుసారం లారీకి రూ.1000 నుంచి అదనంగా వసూలుచేశారు. రూ. కోట్లు దోచేసుకున్నారు. రావులపాలెంనకు చెందిన ఒకరిద్దరు ఇందులో కీలకంగా వ్యవహరించారు. మైన్స్ యజమాని కూడా తన సొంత పనికి ఓ లారీ సరుకు తీసుకోవాలన్నా ఎక్కువ సీనరేజీ చెల్లించవలసి వచ్చేది. వీరికి వైసీపీ అండగా ఉండడంతో వారి దందా సాగింది. చెరువుల్లో మట్టి తీసుకుని వెళ్లినా సీనరేజీ పేరిట అక్రమ వసూళ్ల దందా సాగింది. పైగా ఎన్ని లారీల మెటీరియల్ రవాణా జరిగిందనే దానిలో కూడా మోసాలు జరిగాయి. అధికారికంగా ఒక బిల్లు ఇచ్చి సుమారు 10వరకూ డూప్లికేట్ బిల్లులు చేశారనే ఆరోపణ కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు చాలా ఇబ్బందిపడ్డారు. మైన్స్‌లీజుదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కంపెనీ ప్రభుత్వానికి ఇప్పటికీ రూ.44 కోట్లు బకాయి ఉంది. కానీ వచ్చే ఏప్రిల్ 17వ తేదీ వరకూ ఈ కంపెనీకి ఒప్పంద గడువు ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడితే తర్వాత ఈ విధానం మార్పుకోసం ఎదురుచూశారు. కానీ ఒప్పందాన్ని అనుసరించి తిరిగి అదే కంపెనీకి అధికారులు బాధ్యత అప్పగించారు. కానీ నిబంధనలు కఠినతరం చేశారు. గతంలో మాదిరిగా ఇష్టానుసారం వసూలుచేయడానికి లేదు. ఆన్‌లైన్‌లో బిల్లులు చేయాలి. ఏ క్వారీ నుంచి ఎన్ని యూనిట్లు మెటీరియల్ వచ్చిందో ఆన్‌లైన్‌లో ఉండాలి. ఈసారి ప్రభుత్వం నిర్ణయించిన సీనరేజీనే వసూలుచేసే అవకాశం ఉంది. వినియోగదారుడికి ఇది మేలే. పైగా ఇదే విధానం సక్రమంగా అమలు చేస్తే గతంలో మాదిరిగా ఇష్టానుసారం సీనరేజి ఎగ్గొట్టే పరిస్థితి తగ్గుతుంది. ఇక్కడ మరో విషయం క్షేత్ర స్థాయిలో స్పష్టమవుతోంది. ఒప్పందం ప్రకారం సుధాకర్ ఇన్‌ఫ్రాకే ఇచ్చినప్పటికీ, చెక్‌పోస్టుల వద్ద ఏఎంఆర్ కంపెనీకి చెందిన మనుషులు ఉన్నారు. ఇక్కడ అధికారికంగా సుధాకర్ ఇన్‌ఫ్రా అయినా, వసూలు చేసేది ఏఎంఆర్ కంపెనీ అనే ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వం దీన్ని అసలు పట్టించుకోలేదు. ఈసారైనా అక్రమాలు జరగకుండా చూసి ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు వచ్చే సీనరేజీ ఆదాయాన్ని పెరిగేటట్టు వినియోగదారుడికి సరైన చార్జీలతో సరఫరా చేసేటట్టు చూడవలసి ఉంది.

ఇసుక రవాణా చార్జీలు ఖరారు

జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 22: ఉచిత ఇసుక పాలసీ విధానంలో వినియోగదారుల రవాణా ఖర్చులు, లోడింగ్ చార్జీలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. జాయింట్ కలెక్టర్ సమక్షంలో రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు.

- **పది టైర్ల గూడ్స్ వాహనంలో..** పదిటైర్ల లారీలో 18 టన్నుల ఇసుకను రవాణా చేసేందుకు పది కిలోమీటర్లలోపు రూ.1620, 11-20 కి.మీ లోపు రూ.2800, 21-30 కిలోమీటర్లలోపు రూ.4080, 31-40 కిలోమీటర్లలోపు రూ.5340, 41 కిలోమీటర్ల పైబడిన ప్రతి కిలోమీటర్‌కు అదనంగా రూ.116 చొప్పున చెల్లింపులు చేయాలి.
- **ఆరుటైర్ల లారీలో...** 10 టన్నుల ఇసుకను రవాణా ఖర్చులు 10 కి.మీ లోపు రూ.1000, 11-20 కిలోమీటర్లలోపు రూ.1800, 21-30 కిలోమీటర్లలోపు రూ.2600, 31-40 కి.మీ లోపు రూ.3200, 41 కిలోమీటర్ల పైబడిన ప్రతి కిలోమీటరుకు అదనంగా రూ.67 చొప్పున చెల్లింపులు చేయాలి.
- **ట్రాక్టర్ ట్రాలీలో..** ట్రాక్టర్ ట్రాలీలో 4-5 టన్నుల ఇసుక రవాణాకు 10 కిలోమీటర్లు రూ.600, 11-20 కిలోమీటర్లలోపు రూ1100, 21-30 కిలోమీటర్లలోపు రూ1600, 31-40 కిలోమీటర్లలోపు రూ.2100, 41 కిలోమీటర్లు దాటిన ప్రతి కిలోమీటరుకు రూ. 30 చొప్పున చెల్లింపులు జరగాలి.

వచ్చే నెల 11 నుంచి ఉచిత ఇసుక మార్గదర్శకాలు అమలు

ప్రస్తుతం పెండ్యాల, పందల పర్రు స్టాక్ పాయింట్లలోనే ఇసుక

కలెక్టర్, ఎస్పీ వెల్లడి

రాజమహేంద్రవరం,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 11నుంచి ఉచిత ఇసుక విధానాన్ని పగడ్బందీగా అమలు చేయడానికి కొత్త మార్గదర్శకాలు అమలులోకి రానున్నాయని, ప్రభుత్వం విధానం ప్రకారం ఉచిత ఇసుకలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేవలం పరిపాలనాపరమైన చార్జీలు చెల్లించి, రవాణా చార్జీలు పెట్టుకుని ఇసుకను పొందవచ్చని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆమె ఎస్పీ నరసింహ కిశోర్, జేసీ ఎస్.చినరాముడుతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో పెండ్యాల, పందలపర్రు గ్రామాల్లోనే ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయని, ఇక్కడ రోజుకు 120 లారీలు లోడ్ చేసుకోవచ్చన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంకాలం 6 గంటలవరకూ మాత్రమే ఇసుక సరఫరా చేస్తారన్నారు. పెండ్యాల స్టాక్ పాయింట్‌లో 98వేల టన్నులు, పందలపర్రులో 35వేల టన్నుల ఇసుక ఉందన్నారు. కొత్తగా 9 పాయింట్లు గుర్తించామని, ఇంకా కొన్ని అనుమతులు రావలసి ఉందని, ఇరిగేషన్ శాఖ అధ్వర్యంలో వారంలో అవి మొదలు పెడతామన్నారు. డీసిల్టేషన్‌ను బోట్స్‌మన్ సొసైటీల ద్వారా చేపడతామని చెప్పారు. ఇంతవరకూ కొన్ని లోపాలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఏ అక్రమాలు లేకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అక్టోబరు 15 నుంచి అన్ని ర్యాంపులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈసారి ఇంటి అడ్రస్ కూడా ఇవ్వాలని, ఇసుక అక్కడకు చేరిందా లేదా అనేది కూడా చూస్తామని, వినియోగదారుడు కొత్త ఇల్లు కడుతున్నాడా, రిపేర్లా అనే విషయం కూడా నమోదు చేస్తామన్నారు. ఎస్పీ నరసింహకిశోర్ మాట్లాడుతూ ట్రిక్ షీట్ ఉంటేనే లారీలను అనుమతిస్తామన్నారు. ఇసుక, అక్రమనిల్వలు, అక్రమరవాణా, మధ్యవర్తుల ప్రమేయం, నివారించడానికి పటిష్టమైన నిఘా పెడుతున్నామన్నారు. రీచ్‌ల్లోకి అనుమతి పొందిన వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. క్యూ కడితే చర్యలు తీసుకుంటామని కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

కొవ్వూరులో వర్షం



కొవ్వూరులో కురుస్తున్న వర్షం

కొవ్వూరు, ఆగస్టు 22: కొవ్వూరు పట్టణ, మండలంలో బుధవారం ముసురు వాన కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు, రహదారి గుంతల్లో నీరు చేరి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. 4,5 రోజులుగా ఏదొక సమయంలో వర్షం కురవడంతో రహదారి బెర్మలు, పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయి అపారిశుధ్యాన్ని తలపిస్తున్నాయి. నీరు నిలిచి ఉన్నచోట నాచుపట్టి దుర్వాసన రావడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిడదవోలు మునిసిపల్ కమిషనర్‌గా కృష్ణవేణి



నిడదవోలు, ఆగస్టు 22: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర వ్యాప్తంగా 24 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు నిడదవోలు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.రామ్‌భూపాల్‌రెడ్డిని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీకాగా విను కొండ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టీఎల్‌పీఎస్ఎస్ కృష్ణవేణిని నిడదవోలుకు బదిలీ చేశారు. ఈమె త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

నిడదవోలు సీఐగా శ్రీనివాసరావు



నిడదవోలు, ఆగస్టు 22: నిడదవోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కోట సత్తెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన వి.జానకిరామయ్య విజయవాడ సైబర్ క్రైమ్ సీఐగా బదిలీపై వెళ్లారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల స్వీకరణ

తాళ్లపూడి, ఆగస్టు 22: మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టుకు గెస్ట్ ఫ్యాకల్టీగా బోధించుటకు అర్హులైన అభ్యర్థులను నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాసరావు తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 50శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేదీ లోపు కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని చెప్పారు.

తాళ్లపూడిలో 'మానవత' శాంతి ర్యాలీ

తాళ్లపూడి, ఆగస్టు 22: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా తాళ్లపూడిలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ మాట్లాడుతూ ఎస్.రామచంద్రారెడ్డి 2004 ఆగస్టు 22న 11 మంది సభ్యులతో ప్రారంభించిన మానవత సంస్థ నేడు 60 వేల మంది సభ్యులతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో విద్యకు, వైద్యానికి పెద్ద పీటవేస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, కష్టాల్లో ఉన్నవారి సాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, జోడాల వెంకటేశ్వరరావు, వి.చంద్రయ్య, గోకవరపు బాబులు, పెమ్మాడి దుర్గాప్రసాదు, ఇంజరపు వెంకటకృష్ణ సత్యనారాయణ, మాంటిస్సోరీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



నల్లజర్ల: నల్లజర్లలో జరిగిన కార్యక్రమంలో సంస్థ రీజినల్ చైర్మన్ గుత్తికొండ వరప్రసాద్, మండల కోశాధికారి ఐడీవీ అప్పారావు మానవత జెండా ఆవిష్కరించారు. సమన్వయ కమిటీ చైర్మన్ కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ మానవత సంస్థ ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలందించినట్టు చెప్పారు. అనంతరం పారిశుధ్య కార్మికులను నూతన వస్త్రాలు అందిచారు. కార్యక్రమంలో గుళ్ళపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, పాతూరి రమేష్, ఆదినారాయణ, ప్రతిపాటి గంగారావు పాల్గొన్నారు.

సంస్థకు ఫ్రీజర్ బాక్సు అందజేత

గోపాలపురం: మానవత సంస్థకు వాదాలకుంట గ్రామానికి చెందిన జుజ్జవరపు నర్సమ్మ, రావులమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఫ్రీజర్ బాక్సును అందజేశారు. దీనిని దాతల కుమారులు రమేష్, సురేష్, నరేంద్ర, మురళీ, వంశీ తదితరుల ఆర్థిక సహకారంతో అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మండలాధ్యక్షుడు పప్పు కృష్ణారెడ్డి, చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, గడా జోగేంద్ర, కీర్తికుమార్, ఫణికిషోర్, సీఆర్పీ కొయ్య నాగరాజు, కృష్ణారావు పాల్గొన్నారు.

తాడిపర్రులో ఒలింపిక్స్ క్రీడాకారిణికి సత్కారం



ఒలింపిక్స్ క్రీడాకారిణికి జ్యోతికశ్రీని సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఆగస్టు 22: తణుకు పట్టణానికి చెందిన ఒలింపిక్స్ క్రీడాకారిణి దండి జ్యోతికశ్రీని మండలంలోని తాడిపర్రు గ్రామంలో హైస్కూలు వద్ద గురువారం సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెరగాలని, క్రీడల్లో చిన్నతనం నుంచే రాణించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె సాధించిన విజయం తీరును విద్యార్థులకు వివరించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆమెను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డి.ప్రసాద్, అక్కిన గోపాలకృష్ణ, వాలకపూడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలివెన్నులో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఉండ్రాజవరం, ఆగస్టు 22: మండలంలోని వేలివెన్ను గ్రామంలో విజయవాడకు చెందిన గాయత్రి ఆయుర్వేద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ గీతాభవాని సీజనల్ జ్వరాలు, స్త్రీ సంబంధిత వ్యాధులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. స్థానిక ఆర్యవైశ్య సేవా సంఘం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 125మంది రోగులను పరీక్షించినట్టు నిర్వాహకులు తెలిపారు.

విజయదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



నల్లజర్ల, ఆగస్టు 22: మండలంలోని అవపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో విజయ దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం వేద పండితులు అయిలూరి వేణుగోపాలశర్మ శాస్త్రయుక్తంగా పూజలు నిర్వహించారు. పుట్టింటి ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మ వారిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, జనసేన ఇన్‌చార్జీ సువర్ణరాజు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండగూడెం కనకదుర్గమ్మ ఆలయంలో చోరీ

దేవరపల్లి, ఆగస్టు 22: మండలంలోని గౌరీపట్నం శివారు కొండగూడెం పాత కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం తెల్లవారుజామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. గుడి తలుపులు బద్దలకొట్టి సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హుండీలోని డబ్బులు ఎత్తుకెళ్లారు. బీరువా తాళాలు బద్దలుకొట్టి అందులోని కొన్ని వస్తువులను, అమ్మవారి వస్తువులను దొంగలించినట్టు ఆలయ కమిటీ సభ్యుడు ఉండవల్లి శ్రీనివాస్(గౌరీబాబు) తెలిపారు. ఈ ఆలయంలో గతంలో మూడుసార్లు దొంగతనాలు జరిగాయని దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

తాళ్లపూడి, ఆగస్టు 22: మండలంలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టినట్టు తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. ప్రభుత్వం నియమించిన బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు చేపడతారని వీటితో పాటు ఎమ్మెల్సీ ఓట్లు నమోదు ప్రక్రియ కూడా చేపడతామన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని, ఓటు కార్డులో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉందని, తమ ఇళ్లకు వచ్చే బీఎల్‌వోలకు సహకరించి వివరాలు అందించాలని తహశీల్దార్ కోరారు.

పరిమితి మేరకే పండించాలి

▸ 58.25మిలియన్ కిలోల ఉత్పత్తికే అనుమతి

▸ రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్



దేవరపల్లిలో పొగాకు రైతు సంఘం నాయకులతో సమీక్షిస్తున్న ఆర్ఎం ప్రసాద్

దేవరపల్లి, ఆగస్టు 22: పొగాకుబోర్డు అనుమతి మేరకే పొగాకు పండించాలని రాజమ హేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఎల్‌కే.ప్రసాద్ రైతులకు సూచించారు. గురువారం దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో ఐదు పొగాకుబోర్డులకు చెందిన రైతు సంఘం నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉందని, వచ్చే ఏడాది కూడా ఏ మార్కెట్ ఉంటుందో చెప్పలేమన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేయాలని సూచించారు. గత ఏడాది అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తి చేసే దేశాలు బ్రెజిల్, జింబాబ్వేతోపాటు పలు దేశాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఉత్పత్తి బాగా తగ్గిందని దాని వల్ల మన ప్రాంత పొగాకుకు డిమాండ్ పెరిగిందన్నారు. వచ్చే సంవత్సరానికి పొగాకు బోర్డు 58.25మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చిందన్నారు. పరిమితి కంటే అధికంగా పండిస్తే రైతులు నష్టపోతారన్నారు. ఈ ఏడాది పరిమితికి మంచి ఎక్కువగా పండించిన పొగాకుకు అపరాధ రుసుము లేకుండా వాణిజ్య శాఖ మంత్రి నిర్ణయం తీసుకున్నారని వచ్చే ఏడాది ఆ పరిస్థితులు ఉండవని ఎక్కువ పండించే పొగాకుకు అపరాధ రుసుము ఉంటుందని హెచ్చరించారు. రైతులు ఈ ఏడాది పొగాకు ధరలు అధికంగా ఉండడంతో కౌలురైతులు ఎక్కువ విస్తీర్ణంలో పండించడానికి అధిక కౌలు చెల్లించి భూములు తీసుకుంటున్నారని బ్యారన్ల అద్దెలు కూడా పెంచుకుంటున్నారని, దీని వల్ల ధరల లేకపోతే రైతులు నష్టపోతారని, ఆలోచించి సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ హేమస్మిత, దేవరపలి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం వేలం కేంద్రాల రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, గద్దే శేషగిరిరావు, ఇల్లూరి రాంబాబు, పరిమి రాంబాబు, కాకర్ల నంది, కాట్రు సత్యనారాయణ, పిన్నమనేని మధుమోహన్, గారపాటి సత్యనారాయణ, దుద్దుకూరి హరిబాబు, సత్రం వెంకట్రావు, జగదీష్ పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుతో ప్రయోజనాలు మెండు

▸ జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు



రాజవోలులో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

రాజమ హేంద్రవరం రూరల్, ఆగస్టు 22: సేంద్రీయ వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. మండలంలోని రాజవోలులో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేంద్రీయ పద్ధతిలో రైతులు పండించిన ధాన్యాన్ని 126 దేశాల్లో ఐఎన్‌డీ గేప్ సర్టిఫికేషన్ ద్వారా అమ్ముకొనే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిదన్నారు. సేంద్రీయ సాగుపై మెళకువలను రైతులకు వివరించారు. డాట్ సైంటిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రస్తుతం వరిలో ఆశించే చీడపీడలు, తెగుళ్ల గురించి రైతులను అడిగి తెలుసుకొని వరి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా నీమస్త్రం తయారీ, ఉపయోగించే విధానాన్ని రైతులకు తెలిపారు. వరిలో రసం పీల్చే పురుగు, పేనుబంక, తామర పురుగు, ఎర్రనల్లి, తెల్లదోమను గుడ్డుదశలో నియంత్రించడానికి నీమస్త్రం సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో భీమారావు, విస్తరణాధికారి పీటర్, వీఏఏలు, ఈహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' గ్రామ సభలు

▸ పర్యవేక్షణకు మండలస్థాయి అధికారుల నియామకం

కొవ్వూరు / ఉండ్రాజవరం/గోపాలపురం, ఆగస్టు 22: ఈ నెల 23న కొవ్వూరు, ఉండ్రాజవరం, గోపాలపురం, మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవోలు కె.సుశీల, జీవీఎస్ రామకృష్ణంరాజు, శ్రీదేవి తెలిపారు. ఆయా పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించడానికి ప్రతి పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించినట్టు చెప్పారు. ఈ సభల్లో ప్రధానంగా 2024-25లో పరిపాలన ఆమోదం పొందిన వివరాలను చదివి వినిపించాలన్నారు. గ్రామానికి అవసరమైన కొత్త పనులను గుర్తించుట, సామాజిక తనిఖీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సభలకు ఎన్ ఆర్ఈజీఎస్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, సెరికల్చర్, పశు సంవర్ధకశాఖ, ఉద్యానవన శాఖ సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది సమన్వయంతో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ఉపాధిహామీ వేతనదారులు, ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు.

పెరవలి: మండలంలో ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించేందుకు పంచాయతీలకు పరిశీలకులను నియమించినట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో రమేష్ తెలిపారు. నడిపల్లి, కానూరు గ్రామాలకు ఆర్‌ఐ పావని, కానూరు అగ్రహారం, ఉసు లుమర్రులకు ఎంఈవో స్వరూప్, తీపర్రు, కాకరపర్రుకు ఈవోపీఆర్‌డీ సీహెచ్ వీరమణ, వెంకటరాయపురం, అజ్జరానికి ఎంపీడీవో రమేష్, పెరవలి, కాపవరానికి ఎంఈవో-2 సర్జన్, కొత్తపల్లి, నల్లాకులవారిపాలెంకు వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ముక్కామల, ఖండవల్లికి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సాయి కుమార్, అన్నవరప్పాడు, మల్లేశ్వరానికి వ్యవసాయాధికారి మేరీ కిరణ్, కడింపాడు, పిట్టలవేమవరానికి ఏపీఎం నాగరాజులను నియమించినట్టు తెలిపారు. వీరంతా గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించి రిజిసర్‌లో నమోదు చేస్తారని ఇన్‌చార్జి ఎంపీడీవో చెప్పారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు

▸ పలుచోట్ల అభిమానుల సేవా కార్యక్రమాలు



నల్లజర్లలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, సువర్ణరాజు

కొవ్వూరు, ఆగస్టు 22: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమాన సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం కొవ్వూరు యువరాజ్‌మాల్ వైస్క్రీన్స్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో గంటా చిరంజీవి, కళ్లేపల్లి శ్రీను, ఆవుల వాసు, గందం పవన్, చిట్టూరి త్రినాథ్, గుడుపు ప్రసాద్, చావల మహేష్ పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్లలో నియోజక చిరంజీవి యువత ఇజ్రోతు సత్తిబాబు, రుద్ర శ్రీను ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు కట్ చేశారు. తెలికిచర్లలో దివ్యాంగులకు వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, విడియాల శ్రీను, చెల్లు పెదరామన్నకొత్తపల్లి హరిబాబు, జి.వరుణ్ పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, యర్నగూడెంలో జనసేన ఇన్‌చార్జి డి.సువర్ణరాజు చిరంజీవి బర్త్‌డే కేక్‌లను కట్‌చేసి అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకుడు మాదవరపు వెంకటేశ్వరరావు దేవరపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలలో జనసేన, చిరంజీవి అభిమాన సంఘం నాయకులు పచ్చ రాంగోపాల్, కవల శ్రీనివాస్, చీకట్ల వీరవెంకట్రావు, కామిశెట్టి దుర్గారావు, దుగ్గిన గంగధర్, పోతుల కనకరాజు, బళ్లా రవికుమార్ పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని కానూరు, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, అజ్జరం, ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెరవలిలో చిరంజీవి అభిమానుల సంఘం అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు పిప్పర రవి ఆకుల సూరి, బసవా సురేష్, ఉప్పలపాటి సతీష్, పంపన ప్రసాద్, తీపర్తి అంజి, మానికిరెడ్డి తాతారావు పాల్గొన్నారు.



కొవ్వూరులో కేక్ కట్ చేస్తున్న అభిమానులు



పెరవలి శివాలయంలో పూజలు చేస్తున్న అభిమానులు



దేవరపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ దుర్గారావు

46 హోమియో పీజీ సీట్లు తీసుకొచ్చాం

▸ అప్పటి బూతుల మంత్రి, కమీషన్ స్టార్ పట్టించుకోలేదు

▸ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 22: గత ప్రభుత్వ చేతకానితనం వల్ల రాష్ట్రంలో రెండు హోమియో కళాశాలకు చెందిన 46 పీజీ సీట్లు కోల్పోయే పరిస్థితి వచ్చినప్పుడు తాము స్పందించి వాటిని తిరిగి శాంక్షన్ చేయించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య హోమియోకళాశాలలో 23 పీజీ సీట్లు, గుడివాడ హోమియో కళాశాలలో 23 పీజీ సీట్లును కోల్పోయేలా ఉన్నామని ప్రిన్సిపాల్ తన దృష్టికి తీసుకొచ్చారని వెంటనే తాను స్పందించి ఈ విషయాన్ని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి చెప్పామన్నారు. ఆమె కేంద్రంతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపించారని చెప్పారు. బూతుల మంత్రి కొడాలి నానికి గాని, కమీషన్ స్టార్ భరత్‌రామ్‌కు గాని విద్యార్థుల భవిష్యత్ కనిపించలేదన్నారు. ఈట్‌స్ట్రీట్, ట్రంక్ సెంటర్ నిర్మాణాల్లో వచ్చినట్లుగా కమిషన్ రాదు కాబట్టే హోమియో కళాశాల పీజీ సీట్లు విషయంలో నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. ఇక అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో ప్రమాదం దురదృష్టకరమన్నారు. గతంలో వైజాగ్ పాలిమర్ పరిశ్రమలో ప్రమాదం జరిగినపుడు గత ప్రభుత్వం థర్డ్ పార్టీ ఆడిట్, సేఫ్టీ ఆడిట్‌పై జగన్ ప్రభుత్వం శ్రద్ధ వహించి ఉంటే పరిశ్రమల్లో లోటుపాట్లు ముందే తెలిసి ఉండేవని, అలాంటిదేమి చేయకపోవడంతో పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇక జగన్ హయాంలో పఫ్‌లు తినడానికే రూ.4 కోట్లు ఖర్చుచేశారంటే ప్రజాధనాన్ని ఎంత దారుణంగా వృథా చేశారో అర్థమవుతుందన్నారు. సమావేశంలో ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, జాంపేట బ్యాంక్ చైర్మన్ బొమ్మన జయకుమార్, వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్ కనకం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దేవరపల్లి, ఆగస్టు 22: మండలంలోని రామన్నపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 23న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ కృష్ణారావు తెలిపారు. దీంతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు చెప్పారు.

బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్



రంగంపేట, ఆగస్టు 22: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఈలకొలను గ్రామానికి చెందిన అంచూరి అరుణ్‌కుమార్ నియమితులైనట్టు ఆయనే స్వయంగా తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యాయంలో జరిగిన సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య.. అంచూరి అరుణ్‌కుమార్‌ని నియమించినట్టు తెలిపారు. బీసీ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న అరుణ్‌కుమార్‌ను జాతీయ సంఘంలోకి తీసుకున్నట్టు చెప్పారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, బీసీ సమస్యలపై పోరాడతానన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పెంకే మహేష్, విశాఖపట్నం జిల్లా ఉపాధ్యక్షుడు పితాని అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రాజమండ్రి బార్ అసోసియేషన్

రాజమహేంద్రవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన శోచనీయమని రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ న్యాయవాదులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆధారాలను మాఫీ చేసే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఆ రాష్ట్ర సీఎం ఒక మహిళ అయినప్పటికీ మరో మహిళపై జరిగిన అతి దారుణమైన ఘటనపై తక్షణమే చర్యలు తీసుకోకుండా కేసును తప్పుదోవ పట్టించడం హేయమన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు నాగదేవర స్వర్ణపాప, ప్రధాన కార్యదర్శి పెళ్లూరి రమేశ్, కోశాధికారి కర్రి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పలువురు మంత్రులకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల వినతి



మంత్రులు అనిత, రామానాయుడులకు వినతిపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఆగస్టు 22: రాజానగరం నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం అమరావతిలో వివిధ శాఖల మంత్రులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశారు. నీటి పారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి వ్యవసాయ పంట కాలువల్లో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, సూరంపాలెం రిజర్వాయర్ కాలువ పనులు, గాదరాడ లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ, బొబ్బిల్లంక పంపింగ్ స్కీమ్ రెండోసారి టెండర్ పిలిచేందుకు పరిపాలన ఆమోదం, బొబ్బిల్లంక నుంచి పురుషోత్తపట్నం వరకు గోదావరి బండ్ రోడ్డు అభివృద్ధి పనులపై చర్చించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి గత ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిపోయాయని, మహిళలకు రక్షణ కరువైందని, గంజాయి రవాణా, సాగు కట్టడిచేసి యువత భవిష్యత్తును కాపాడాలని కోరారు. అలాగే పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజను కలిసి తాగునీరు, మంచినీటి పైపులైన్లు, ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఆర్ ట్యాంకుల నిర్మాణం, రోడ్లు డ్రైనులు, డంపింగ్ యార్డులు, వీధిలైట్లు, విద్యుత్ స్తంభాలు, పారిశుధ్య నిర్వహణ పనులకు సంబంధించిన సమస్యలు తక్షణమే పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు.

సెప్టెంబరు 28న నన్నయలో జాతీయ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 22: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సెప్టెంబరు 28న శ్రీ గురు విశ్వస్ఫూర్తి రచనలు- ఆధునిక, వైజ్ఞానిక, సామాజిక దృక్పథం అనే అంశంపై తెలుగు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచరును గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నన్నయ వర్సిటీ తెలుగుశాఖ, స్ఫూర్తి కుటుంబం- ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సుకు తెలుగు భాషాభిమానులు, సాహిత్యవేత్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సదస్సు కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ గురువిశ్వస్ఫూర్తి రచనలలోని వివిధ దృక్పథాలపై వ్యాసపత్రాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.రజనీకాంత్, వి.సదాశివరావు, టీవీఎస్ ప్రసాద్, కేవీఎన్‌డీ వరప్రసాద్, డి.లక్ష్మీనరసమ్మ, పీబీ సంజీవరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రైతు విరాళం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 22: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్ నిర్వహణ నిమిత్తం రైతుబజార్‌కు చెందిన రైతు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10 వేలు విరాళం అందించారు. గురువారం రాజమహేంద్రవరం క్వారీసెంటర్ రైతు బజార్‌లో వ్యాపారం చేసే రైతు అంగరపు శ్రీను (కూనవరం) స్థానిక తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు రూ.10 వేల అందించారు. ఈ సందర్భంగా శ్రీనును ఎమ్మెల్యే అభినందించారు.

నేను పార్టీ మారడం లేదు

నిడదవోలు మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, ఆగస్టు 22: తాను పార్టీ మారుతున్నట్టు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు.తెలిపారు. గురువారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో ఒక ఒప్పందం జరిగిందన్నారు. మొదటి రెండున్నరేళ్లు తాను మున్సిపల్ చైర్మన్‌గాను తర్వాత రెండేళ్లు కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ, తదుపరి ఆరు నెలలు కౌన్సిలర్ పువ్వల రతీదేవి పదవీ బాధ్యతలు స్వీకరించేలా ఒప్పందం చేసుకున్నామన్నారు. అయితే 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే నాయుడుకు, తనకు మధ్య కొన్ని ఆంతరింగిక వ్యవహారాలు ఉన్నాయని దాంతో చైర్మన్ వ్యవహారం కొద్దిగా అలస్యమైందన్నారు. అంతరింగిక వ్యవహారాలకు సంబంధించి హామీ పూర్తి రాగానే రాజీనామా చేస్తానని ప్రకటించారు. కౌన్సిల్‌లో కొత్త చైర్మన్ ఎన్నిక జరుగుతుందని, తమ కౌన్సిలర్స్ అంతా నాయుడు ఆధ్వర్యంలోనే పనిచేస్తామని ఆదినారాయణ అన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మిస్టర్ బచ్చన్
వై.స్క్రీన్2	తంగలన్
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
రాధాకృష్ణ	ఆయ్, తంగలన్
శ్రీగణపతి	డబుల్ ఇస్మార్ట్

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	---
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---